


పంపిణీకి సిద్ధంగా ఉన్న సన్న బియ్యం బస్తాలు

పేరుకుపోతున్నాయి..


నారాయణపేట జిల్లా మద్దూరు మండలం ఖాజీపూర్‌లో రెవెన్యూ సదస్సు పైలట్ ప్రాజెక్టు ప్రారంభం సందర్భంగా మహిళా రైతులతో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి(ఫైల్)

భూభారతి దరఖాస్తులు పరిష్కారం కావడంలో తీవ్ర జాప్యం

- ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల సంఖ్య 95వేలకు పైనే..
- రెవెన్యూ సదస్సుల దరఖాస్తులూ పరిష్కారమైంది 22 శాతమే..
- 4.05 లక్షల దరఖాస్తులకు గాను.. 89461 దరఖాస్తులే అప్రూవల్
- ఎక్కువ పెండింగ్ తహసీల్దార్ల వద్దే.. మాడ్యూల్స్‌లో డేటా కరెక్షన్
- రెవెన్యూ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న పట్టాదారులు

మహబూబ్‌నగర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : రాష్ట్రంలోని రెవెన్యూ కార్యాలయాల్లో భూ భారతి దరఖాస్తులు పేరకుపోతున్నాయి. ఇప్పటికే వేల సంఖ్యలో పెండింగ్‌లో ఉండగా.. రోజూ వందల సంఖ్యలో కొత్త దరఖాస్తులు వస్తున్నాయి. దీంతో పరిష్కారంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. గత ప్రభుత్వ హయాంలో తీవ్రమైన భూ వివాదాలకు కారణమైన ధరణి స్థానంలో, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత భూ భారతి పోర్టల్‌ను ప్రారంభించిన విషయం తెలిసిందే.. పోర్టల్‌ను ప్రారంభించడానికి ముందే రాష్ట్రంలోని ఐదు మండలాల్లో పైలట్ ప్రాజెక్టుగా రెవెన్యూ సదస్సులు నిర్వహించి.. తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో సదస్సులను పూర్తిచేసింది. మొత్తం 14 కేటగిరీల్లో సమస్యలపై రైతుల నుంచి దరఖాస్తులను తీసుకుంది. ఈ సదస్సుల్లో 4.05 లక్షల దరఖాస్తులు పట్టాదారులు/కక్షిదారుల నుంచి వచ్చాయి. కానీ సదస్సులు పూర్తయి నెలలు గడుస్తున్నప్పటికీ.. కేవలం 22 శాతం మాత్రమే దరఖాస్తులను పరిష్కరించారు. ఇంకా 78 శాతం దరఖాస్తులను పరిశీలించి.. పరిష్కరించడమో.. లేదా సరిగా వివరాలు లేకుంటే తిరస్కరించడమో చేయాల్సి ఉంది. ఈ సదస్సుల్లో దరఖాస్తులు చేసుకున్నవారు తమ సమస్యల పరిష్కారం కోసం రెవెన్యూ కార్యాలయాల

విభాగాల వారీగా పెండింగ్ వివరాలు

మాడ్యూల్ పేరు	పెండింగ్ దరఖాస్తులు
ఎన్‌ఆర్‌ఐ పీపీబీ	128
కోర్టు కేసు ఇన్టిమేషన్	5444
కోర్టు కేసు పీపీబీ	2721
డేటా కరెక్షన్	42178
జీపీఏ/ఎగ్జిక్యూటెడ్ జీపీఏ	306
గ్రీవియన్స్ ప్రొహిబీటెడ్ ప్రాపర్టీ	23998
ఇష్యూ ఆఫ్ పీపీబీ/	226
నాలా- హౌజ్‌సైట్స్ ఖాతా మెర్జింగ్	191
ల్యాండ్ మ్యాటర్ గ్రీవియన్స్	885
నాలా డబ్ల్యూఓ పీపీబీ	2223
ఆర్గనైజేషన్ పీపీబీ	3
పెండింగ్ మ్యుటేషన్	7763
సక్సేషన్	9255
అర్బన్ ల్యాండ్	264
మొత్తం	95585



నేడు అచ్చంపేటకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ రాక



అచ్చంపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆదివారం నాగర్‌కర్నూలు జిల్లా అచ్చంపేట పట్టణానికి వస్తున్నట్లు వనవాసీ కల్యాణ పరిషత్ కమిటీ సభ్యుడు అశోక్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో 108 ఆదివాసీ చెంచుల జంటలకు వనవాసీ కల్యాణ పరిషత్ ఆధ్వర్యంలో వివాహాలు నిర్వహిస్తారు. ఉదయం 11 గంటలకు సామూహిక వివాహాల కార్యక్రమంలో పాల్గొని తిరిగి మధ్యాహ్నం 3:30 గంటలకు హైదరాబాద్‌కు వెళతారని ఆయన పేర్కొన్నారు. ఆయనతో పాటు తెలంగాణ హైకోర్టు జడ్జి జస్టిస్ మాధవీదేవి, వనవాసీ కల్యాణ ఆశ్రమం అఖిల భారత కార్యకారిణి సభ్యులు రేఖానాగర్ పాల్గొంటారని తెలిపారు.

కురుమయ్యకు పచ్చి పులుసే పరమాన్నం

- జాతర మైదానంలో భక్తిశ్రద్ధలతో దాసంగాలు
- నియమ నిష్టలతో భక్తుల మొక్కులు


6
నైవేద్యాన్ని విస్తరిలో వడ్డిస్తున్న భక్తురాలు

నూకలొస్తున్నాయ్..

- సన్న బియ్యం పథకానికి తూట్లు
- సీఎంఆర్‌లో నూక కలుపుతున్న మిల్లర్లు
- నియంత్రించని క్వాలిటీ కంట్రోల్ అధికారులు
- విక్రయించిన ధాన్యాన్ని భర్తీ చేసేందుకు అడ్డదారులు తొక్కుతున్న వ్యాపారులు



రాష్ట్రంలోని నిరుపేదలు సన్నబియ్యం అన్నం తినాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీ పథకం అమలు చేస్తోంది. కానీ సంబంధిత అధికారుల నిర్లక్ష్యం కారణంగా రేషన్ బియ్యంలో నూకలు అధికంగా వస్తున్నాయని లబ్ధిదారులు వాపోతున్నారు. కొందరు అధికారులు మామూళ్లకు అలవాటు పడటంతోనే నూకలు వస్తున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి నాణ్యమైన బియ్యం పంపిణీ చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

గద్వాల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని రేషన్ దుకాణాల ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ చేస్తోంది. ప్రభుత్వ లక్ష్యం బాగానే ఉంది.. కానీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా మిల్లర్లు ఆ పథకానికి తూట్లు పొడుస్తున్నారు. రేషన్ దుకాణాలలో పంపిణీ చేస్తున్న బియ్యంలో నూకలు వస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నా అధికారులు స్పందించడం లేదు. కొందరు అధికారులు మామూళ్లకు అలవాటు పడటంతోనే బియ్యంలో నూకలు వస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

ముడుపులతో సరి..

ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల నుంచి కేటాయించిన ధాన్యాన్ని గద్వాలలోని కొందరు రైస్ మిల్లర్లు బయటకు విక్రయించి కోట్లు గడిస్తున్నారు. సీఎంఆర్ సమయం వచ్చినప్పుడు ఉన్న ధాన్యాన్ని మర ఆడించి అందులోకి తక్కువ ధరతో కొనుగోలు చేసిన నూకలను కలిపేసి ప్రభుత్వానికి అప్పగిస్తున్నారు. నిబంధనలను పాటించాల్సిన క్వాలిటీ కంట్రోల్ అధికారులు మామూళ్లకు అలవాటు పడటంతోనే నూకలు వస్తున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి.

ప్రతీ నెల 411 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ

జోగుళాంబ గద్వాల జిల్లాలో నిరుపేదలే ఎక్కువగా ఉన్నారు. జిల్లాలో రేషన్ కార్డులు 1లక్షా84 వేల 384 కార్డులు ఉన్నాయి. అందులో అంత్యోదయ కార్డులు 10వేల334, అన్నపూర్ణ కార్డులు 124 ఉన్నాయి. మొత్తం లబ్ధిదారులు 6లక్షల 54వేల 834 మంది ఉన్నారు. వీరికి ప్రతీ నెల 411 మెట్రిక్ టన్నుల బియ్యం పంపిణీ చేస్తున్నారు.

నిబంధనలు పాటించని అధికారులు

సీఎంఆర్‌గా వచ్చిన బియ్యాన్ని సివిల్ సప్లయ్ గోదాములలో నిల్వచేయాలంటే ముందుగా క్వాలిటీ కంట్రోల్ అధికారులు పరిశీలించాలి. తీసుకున్న వంద గ్రాముల బియ్యంలో నూకలు 15 నుంచి 20శాతం వరకు ఉండవచ్చు, మట్టిపెళ్లలు 0.5శాతం, డ్యామేజ్ అయినవి 3 శాతం, రంగుమారినవి 3 శాతం, తాలు గింజలు 5శాతం వరకు ఉండొచ్చనే నిబంధన ఉన్నట్లు అధికారులు తెలిపారు. పాలిష్ మాత్రం 10 శాతం పట్టాలని అధికారులు తెలిపారు. కానీ అధికారులు ఇవేవీ పరిశీలించకుండా రికార్డులు చేసేసి గోదాములలోకి బియ్యాన్ని పంపిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

క్వాలిటీ చెక్ చేస్తున్నాం..

నిబంధనల ప్రకారమే సీఎంఆర్ ధాన్యం ఎఫ్‌సీఐ గోదాములలోకి వస్తుంది. అన్ని పరిమాణాలను చెక్ చేస్తాం. అదేవిధంగా మళ్లీ రేషన్ షాపులకు పంపిస్తున్నప్పుడు కూడా పరిశీలిస్తున్నాం.

– సుబ్బయ్య, క్వాలిటీ కంట్రోల్ అధికారి, గద్వాల

పత్తి అంతా అయిపోయింది

సీసీఐ కొనుగోలు కేంద్రం ప్రారంభంలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి


పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ఇప్పుడు ప్రారంభిస్తే రైతులకు ఉపయోగం లేదని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. శనివారం గద్వాల పట్టణంలో సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. నెల రోజుల నుంచి పత్తి విక్రయాలు జరుగుతుండగా కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ఇప్పుడు ప్రారంభిస్తే ఏమి ప్రయోజనమని ప్రశ్నించారు. ఇప్పటికే కొనుగోలు చేసిన దళారులు కపాస్ కిసాన్ యాప్‌ను ఉపయోగించి ఎక్కువ ధరకు విక్రయించి లాభం పొందుతారని విమర్శించారు. తేమ 12శాతం కంటే తక్కువగా ఉండాలని సీసీఐ నిబంధనలు పెట్టిందని ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు తేమ అధికంగానే ఉంటుందన్నారు. ఇలాంటి నిబంధనలతో రైతులు ఎలా విక్రయిస్తారని ప్రశ్నించారు. కార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి పుష్పమ్మ, మార్కెట్ చైర్మన్ కుర్వ హనుమంతు, నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, విజయ్‌కుమార్, కొత్తపల్లి మహేశ్వర్‌రెడ్డి, పటేల్ ప్రభాకర్‌రెడ్డి ఉన్నారు.

సజావుగా ఎస్ఐఆర్ ప్రక్రియ

నాగర్‌కర్నూల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బీఎల్‌వోలకు శిక్షణ అందించి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియ సజావుగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. శనివారం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సి.సుదర్శన్‌రెడ్డి అన్ని జిల్లా కలెక్టర్లు, ఈఆర్‌వోలతో ఎస్ఐఆర్ ప్రక్రియపై సన్నాహక సమావేశం నిర్వహించారు. నాగర్‌కర్నూల్ నుంచి ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పీ అమరేందర్, ఆర్డీవోలు సురేష్ బన్సీలాల్, జనార్దన్‌రెడ్డి, మాధవి, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ రవి కుమార్, జిల్లాలోని అన్ని మండలాల తహసీల్దార్లు, ఇతర రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ బదావత్ సంతోష్ మాట్లాడుతూ 2002 ఓటరు జాబితాతో 2025 జాబితాను ఆధారంగా ప్రక్రియ పూర్తి చేస్తామని తెలిపారు. ఎస్ఐఆర్ నిర్వహణపై సూపర్‌వైజర్లు, బీఎల్‌వోలకు శిక్షణలు అందిస్తామని అయన తెలిపారు.



వీసీలో పాల్గొన్న కలెక్టర్ బదావత్ సంతోష్, ఆర్డీవోలు

రైతులు ఆందోళన చెందొద్దు

- ధాన్యం తడిసినా ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది
- వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి


తడిసిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి

పెద్దమందడి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేస్తుంది, రైతులు ఎవరూ ఆందోళన చెందొద్దని వనపర్తి ఎమ్మెల్యే మేఘారెడ్డి భరోసా ఇచ్చారు. శనివారం కురిసిన వర్షానికి వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం బలిజపల్లి గ్రామంలో తడిసిన ధాన్యాన్ని ఆయన పరిశీలించారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారు. త్వరలోనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామన్నారు. అనంతరం బలిజపల్లిలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. బిల్లులు సకాలంలో వస్తున్నాయా.. అని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఎన్నో ఏళ్లుగా సొంత ఇంటి నిర్మాణం కోసం ఎదురు చూస్తున్న తమకు ఇందిరమ్మ రాజ్యంలో ఇళ్లు మంజూరు కావడం సంతోషంగా ఉందని వారు తెలిపారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మాజీ సభ్యుడు రమేశ్‌గౌడ్, బాల రాజు, మల్లేశ్, నరసింహ, యాదగిరి, సురేం దర్‌గౌడ్, వేణుగౌడ్, మన్యం, బుచ్చన్న తదిత రులు పాల్గొన్నారు.

వర్షపునీటిలో ధాన్యం

చిట్యాల మార్కెట్‌లో తడిసిన వరి, మొక్కజొన్న


వనపర్తి పట్టణ సమీపంలోని చిట్యాల మార్కెట్ యార్డ్‌లో వర్షపు నీటిలో నుంచి ధాన్యాన్ని కుప్ప కడుతున్న రైతులు
6

క్రీడా రంగంలో మహిళామణులు

- క్రికెట్ అకాడమీలో శిక్షణ..
- రాష్ట్ర, జాతీయ స్థాయిలో సత్తాచాటుతున్న క్రికెటర్లు


వనపర్తి గిరిజన బాలికల క్రికెట్ అకాడమీలో శిక్షణ ఇస్తున్న కోచ్ మన్నాన్
7

బడుగు వర్గాలకు రాజ్యాధికారమే ధ్యేయం

- బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్ కల్పించాలి
- విలేకర్ల సమావేశంలో తెలంగాణ లోక్‌దళ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్సీ కే దిలీప్‌కుమార్

7


ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా చికెన్ సెంటర్స్ అసోసియేషన్
నేటి చికెన్ ధరలు

ఫామ్ లైవ్	: 130.00
హోల్ సేల్	: 139.00
డ్రెస్డ్	: 234.00
స్కిన్ లెస్	: 251.00

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

- జల్సాలకు అలవాటుపడి చోరీలు
- ముగ్గురు అరెస్ట్.. ఒకరు పరారీ
- రూ. 1.20 లక్షల నగదు, ఐదున్నర తులాల బంగారం, సెల్‌ఫోన్లు, బైకులు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన డీఎస్పీ



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ మొగులయ్య

గద్వాల క్రైం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జల్సాలకు అలవాటు పడి దొంగతనాలు చేస్తున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను పట్టుకున్నట్లు డీఎస్పీ మొగులయ్య తెలిపారు. శనివారం గద్వాల పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఈ ఏడాది ఆగస్టు నుంచి జోగుళాంబ గద్వాల జిల్లా మల్దకల్‌లోని మద్దెలబండ, గద్వాల మండలంలోని జమ్మిచేడు, కేటీదొడ్డిలోని చింతలకుంట, ధరూర్ మండలంలోని మార్లబీడు గ్రామాల్లో ఐదు దొంగతనాలు జరిగాయి. ఈ చోరీలకు పాల్పడిన వారిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. శనివారం మల్దకల్ మండల కేంద్రంలో వాహనాలు తనఖీ చేస్తుండగా గద్వాల వైపు నుంచి మల్దకల్ వైపునకు వస్తున్న ముగ్గురు అనుమానంగా కనిపించడంతో వారిని పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. ఈ ఐదు దొంగతనాలలో ఈ ముగ్గురితో పాటు మరొకరు ఉన్నట్లు పోలీసులు నిర్ధారించారు. దొంగతనం చేసిన వారిలో కర్ణాటక రాష్ట్రం రాయిచూర్ జిల్లాకు చెందిన కుర్వ గిరీశ్, చంద్రశేఖర్, కేటీదొడ్డి మండలం చింతలకుంటకు చెందిన కుర్వ చిన్నవెంకన్న, ప్రాణేశ్‌లు ఉన్నట్లు గుర్తించారు. చంద్రశేఖర్ పరారీలో ఉండగా ఈ ముగ్గురి నుంచి ఐదున్నర తులాల బంగారం, రూ.1.20 లక్షల నగదు, రెండు బైకులు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. దాదాపు 90శాతం రికవరీ చేసినట్లు డీఎస్పీ తెలిపారు. కేసు ఛేదించిన సీఐ, ఎస్ఐలు, సిబ్బందిని ఎస్పీ అభినందించి రివార్డులను ప్రకటించినట్లు ఆయన తెలిపారు. సమావేశంలో సీఐ టీ.శ్రీను, మల్దకల్ ఎస్ఐ నందికర్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

పులికల్‌లో నకిలీ మందుల కలకలం

- విచారించిన వ్యవసాయ, పోలీసు అధికారులు
- రూ. 5 లక్షల విలువ చేసే మందులు స్వాధీనం

7

సుంకేసుల జలాశయానికి పెరిగిన వరద

కురుమయ్యకు పచ్చి పులుసే పరమాన్నం

» జాతర మైదానంలో జోరుగా దాసంగాలు

» నియమ నిష్టలతో భక్తుల మొక్కులు



జాతర మైదానంలోని రేకుల షెడ్లలో దాసంగాలను సిద్ధం చేస్తున్న భక్తులు

చిన్నచింతకుంట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కలియుగ శ్రీనివాసుని ప్రతిరూపమైన కురుమూర్తి వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. స్వామి వారు ఇక్కడ స్వయంభుగా వెలిశారు. అయితే స్వామి వారికి అత్యంత ప్రీతిపాత్రమైన నైవేద్యం మట్టి కుండలో అన్నం, పచ్చి పులుసే పరమాన్నంగా స్వీకరిస్తారన్నది భక్తుల నమ్మకం. కొత్తగా తీసుకువచ్చిన మట్టి కుండల్లో అన్నం వండి, స్వామి వారికి నైవేద్యంగా సమర్పించడం ఇక్కడ ప్రత్యేకత. ప్రతీ ఏటా కుటుంబ సమేతంగా బంధుమిత్రులతో కలిసి కురుమూర్తి జాతర ప్రాంగణానికి చేరుకుంటారు. అనంతరం అక్కడ స్వామి వారి పుష్కరిణిలో స్నానాలు చేసి, కోనేటిరాయుడికి నమస్కరిస్తారు. అక్కడే మట్టి కుండను కొనుగోలు చేస్తారు. అందులో నీటిని నింపి, కుండలో బెల్లం ముక్క వేసి అన్నం వండుతారు. అలాగే కొత్త చింతపండు కలిగిన దానితో పచ్చి పులుసును తయారు చేసి స్వామి వారికి వండిన అన్నం, పచ్చి పులుసును రెండు కలిపి విస్తరిలో వడ్డించి స్వామి వారికి నైవేద్యంగా సమర్పిస్తారు.

మా తాతల కాలం నుంచి దాసంగాలు పెడుతున్నాం



మా తాతల కాలం నుంచి కురుమయ్య స్వామి మా ఇష్టదైవం. అప్పటి నుంచి మేము దాసంగాలు పెడుతూ స్వామి వారిని దర్శించుకుంటున్నాం. పచ్చి పులుసు, మట్టి కుండలో అన్నం వండి వడ్డించడం ఇక్కడ స్వామి వారికి ఎంతో ఇష్టం. అందుకే మేము ప్రతీ ఏటా స్వామి వారి దర్శనం కోసం వస్తున్నాం.

- నాగన్న, చిన్నచింతకుంట, భక్తులు

ఇక్కడ దాసరులుగా స్వామి వారి సేవలో ఉంటున్నాం



మేము తాతల కాలం నుంచి కురుమూర్తి స్వామికి దాసులుగా పని చేస్తున్నాం. స్వామి వారికి అత్యంత ఇష్టమైన పచ్చి పులుసుతో కూడిన మట్టికుండలో కూడిన అన్నంను తయారు చేసి వడ్డించడం ఆచారం. మేము కూడా దాసంగాలు పెడుతున్న భక్తులకు ఆశీర్వదిస్తున్నాం.

- రాములు దాసరి , అల్లిపురం

ఎన్నో ఏళ్లుగా దాసంగాలు పెడుతున్నాం



మట్టి కుండలో అన్నం పచ్చి పులుసుతో కూడిన నైవేద్యాన్ని స్వామి వారికి దాసంగాల రూపంలో స్వామి వారికి తయారు చేస్తున్నాం. మా తాతల కాలం నుంచి మేము ఇక్కడికి వస్తున్నాం.

- అలివేలు , వడ్డేమాన్

నేడు కురుమూర్తి స్వామి అలంకారోత్సవం

» దర్శించుకోనున్న ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు

» ఆత్మకూరు ఎస్‌బీఐ నుంచి ఆభరణాల ఊరేగింపు ప్రారంభం

చిన్నచింతకుంట/ఆత్మకూరు/అమరచింత, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : కురుమూర్తి వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా తొలి ఘట్టంగా భావిస్తున్నా అలంకారోత్సవ కార్యక్రమం ఆదివారం వైభవంగా జరగనుంది. వనపర్తి జిల్లా ఆత్మకూరు ఎస్‌బీఐలో భద్రపరిచిన స్వామి వారి ఆభరణాల పెట్టెను ఆత్మకూరు పట్టణం గుండా భారీ ఊరేగింపు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా అక్కడ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, దేవాదాయ శాఖ అధికారులు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారి ఆభరణాలను దర్శించుకోనున్నారు. గాడి వంశానికి చెందిన స్వర్ణకారులు ఆభరణాలను తలపై ఉంచుకుని ఊరేగింపులో పాల్గొంటారు.

స్వామి వారి ఆభరణాలు ఆత్మకూరు పట్టణం గుండా సమీపంలోని పరమేశ్వర స్వామి చెరువు కట్ట మీదుగా మదనాపురం మండలం కొత్తపల్లి , దుప్పల్లి గ్రామాలకు చేరుకోనున్నాయి. అక్కడ దుప్పల్లి గ్రామంలో భక్తులు స్వామి వారి ఆభరణాలకు ఘన స్వాగతం పలకనున్నారు.

అలాగే అమ్మాపూర్ గ్రామంలోని రాజా శ్రీరాం భూపాల్ నివాసంలో ఆభరణాలకు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు . దాదాపు రెండు గంటల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం స్వామి వారి జాతర మైదానం గుండా స్వామి వారి రాజగోపురం గుండా స్వామి వారి గుట్టపైకి ఆభరణాలు చేరుకుంటాయి.

అనంతరం అక్కడ అధికారులు, ప్రజాప్రతినిధుల సమక్షంలో ఆభరణాలను తీసి లెక్కిస్తారు. అనంతరం అర్చకుల నేతృత్వంలో స్వామి వారి ఆభరణాలను స్వామి వారికి అలంకరిస్తారు.

దీంతో స్వామి వారు కాంచన గుహ బంగారు కాంతులను విరాజిమ్మనుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి డాక్టర్ వాకిటి శ్రీహరి, దేవరకద్ర నియోజకవర్గ ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డితోపాటు ఆలయ కమిటీ సభ్యులు బ్యాంకు అధికారులు పాల్గొననున్నారు.

గజవాహన సేవలో శ్రీనివాసుడు..



కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గజవాహనంపై స్వామి వారు

చిన్నచింతకుంట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కలియుగ ప్రత్యక్షదైవం, పేదల తిరుపతి కురుమూర్తి వేంకటేశ్వర స్వామి వారి బ్రహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా శనివారం రాత్రి స్వామి వారిని గజవాహన సేవలో భక్తులు ఊరేగించారు. స్వామి వారి గర్భగుడి నుంచి మోకాళ్ల గుండు వరకు మెట్ల దారి గుండా భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి పల్లవి సేవల ను ఊరేగింపు నిర్వహించారు.

దేవాదాయ శాఖ మంత్రి సురేఖకు ఆహ్వానం

కురుమూర్తిస్వామి బ్రహ్మోత్సవాలకు రావాలని శనివారం హైదరాబాద్‌లో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, ఈవో మధుమేశ్వర్‌రెడ్డి, పాలకవర్గం సభ్యులు భాస్కరాచారి తదితరులు ఆహ్వాన పత్రికను ఆమెకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది.

నేడు పట్టు వస్త్రాల ఊరేగింపు

అలంకార మహోత్సవం సందర్భంగా అమరచింత చేనేత కార్మికులు నేచిన స్వామి వారి పట్టు వస్త్రాలను ఆదివారం ఉదయం తీసుకుపోనున్నారు. పది రోజులుగా అమరచింత పద్మశాలి కులస్థులు మార్కండేయ స్వామిపట్టు వస్త్రాలను ప్రత్యేక పూజల మధ్య నేత పని ప్రారంభించారు. ఆనవాయితీ ప్రకారం అమరచింతలో ప్రత్యేక మగ్గంపై నేసిన కురుమూర్తి స్వామి వారి పంచె, కండువా, అమ్మవారి చీర, రవికెలను ఆదివారం ఉదయం మార్కండేయ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. భాజా భజంత్రీలు మధ్య పట్టణంలో పెద్ద ఎత్తున ఊరేగింపుగా ఆత్మకూర్ ఎస్బీఐ బ్రాంచికి తరలించనున్నారు. అక్కడ నుంచి కురుమూర్తి స్వామి ఆభరణాలతో పాటు పట్టు వస్త్రాలు తీసుకెళ్లి కాంచన గుహలో కురుమూర్తి రాయుడికి సమర్పించనున్నారు.

రక్తదానం చేయండి.. మరో ప్రాణం కాపాడండి



రక్తదానం చేసిన జగన్మోహన్ యాదవ్‌ను అభినందిస్తున్న వనపర్తి ఎస్పీ రావుల గిరిధర్

కోడేరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : పోలీసు అమరవీరుల సంస్మరణ సందర్భంగా రక్తదానం చేయండి.. మరో ప్రాణం కాపాడండి అని వనపర్తి ఎస్పీ రావుల గిరిధర్ పిలుపునిచ్చారు. శనివారం పోలీసు అమరవీరుల సంస్మరణ సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో కోడేరు మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు పోడేండ్ల జగన్మోహన్‌యాదవ్ రక్తదానం చేసి నలుగురికి ఆదర్శంగా నిలిచారు. ఆయనను ఎస్పీ అభినందించారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ కోసం స్థల పరిశీలన



మొలకమామిడిలో విద్యుత్ పవర్ సబ్ స్టేషన్ కోసం స్థలాన్ని పరిశీలిస్తున్న ట్రాన్స్‌కో ఎస్‌పీడీసీఎల్ అధికారులు

అమ్రాబాద్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండల పరిధిలోని మొలకమామిడి గ్రామ సమీపంలో 39సర్వే నెంబరులో ఉన్న 6ఎకరాల ప్రభుత్వ భూమిలో 220/33కేవీ విద్యుత్ పవర్ సబ్‌స్టేషన్‌ను నిర్మించడానికి ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ సర్వే నెంబరులో ఉన్న భూమి అనుకూల పరిస్థితులను పరిశీలించడానికి ట్రాన్స్‌కో ఎస్‌సీడీసీఎల్ అధికారులు శనివారం మొలకమామిడికి వచ్చారు. రూ.59కోట్ల వ్యయంతో ఈ పవర్ సబ్‌స్టేషన్ నిర్మించనున్నట్లు, ఇందుకు కావాల్సిన అంచనాలను రూపొందించినట్లు అధికారులు తెలిపారు. ఇందుకు సంబంధించిన టెండర్లు పూర్తైన వెంటనే పనులను ప్రారంభిస్తామని వారు వెల్లడించారు. ఈ పవర్ సబ్‌స్టేషన్ నిర్మాణం జరిగితే నల్లమల ప్రాంతంలో విద్యుత్ సరఫరాలో ఎలాంటి అవాంతరాలు ఎదురు కావని వారు వివరించారు. నాగర్‌కర్నూల్ డీఎస్‌పీడీసీఎల్ డీఈ శ్రీధర్‌శెట్టి, కల్వకుర్తి ట్రాన్స్‌కో ఏడీ గడుదాస్ శ్రీనివాసులు, అచ్చంపేట ట్రాన్స్‌కో ఇన్‌చార్జి ఏడీ ఆంజనేయులు, అమ్రాబాద్ ఏఈ రమేష్, స్థానిక లైన్‌మన్ ఉన్నారు.

హోంగార్డుకు అంతిమ వీడ్కోలు



వెంకటస్వామి అంతిమయాత్రలో పాల్గొన్న పోలీసులు

పెద్దకొత్తపల్లి/కోడేరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఆదిరాల వద్ద శుక్రవారం రాత్రి 167కే జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో హోంగార్డు వెంకటస్వామి (43) మృతి చెందిన విషయం విదితమే. నాగర్‌కర్నూల్ జిల్లా ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం శనివారం సాయంత్రం పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలోని పద్మావతి జూనియర్ కాలేజ్ నుంచి ఎంపీడీవో కార్యాలయం వరకు అంతిమయాత్ర నిర్వహించారు. పోలీసులు, తోటి హోంగార్డులు, బంధుమిత్రులు కడసారిగా నివాళులర్పించి వీడ్కోలు పలికారు. అంత్యక్రియల కోసం స్వగ్రామమైన కోడేరు మండలం పసుపులకు భౌతికకాయాన్ని తరలించారు. మృతుడికి భార్య చెన్నమ్మ, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

అంత్యక్రియలు పూర్తి

కోడేరు: వెంకటస్వామి అంత్యక్రియలు శనివారం పూర్తయ్యాయి. కోడేరు మండల పరిధిలోని పసుపుల గ్రామానికి చెందిన ఆయన ఇంటి దగ్గర అంత్యక్రియలు నిర్వహించారు. పెద్దకొత్తపల్లి ఎస్‌ఐ సతీష్, కోడేరు ఎస్‌ఐ జగదీశ్వర్, పోలీస్ సిబ్బంది, హోంగార్డులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు. వెంకటస్వామి కుటుంబానికి ఎస్‌ఐలు ఆర్థిక సహాయం అందించారు.

వర్షంలో ధాన్యం

చిట్యాల మార్కెట్‌లో తడిసిన వరి, మొక్కజొన్న



చిట్యాల మార్కెట్‌యార్డ్‌లో తడిసిన ధాన్యాన్ని ప్రోగు చేస్తున్న రైతు

వనపర్తి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): వనపర్తి జిల్లాలో శనివారం తెల్లవారు జామున కురిసిన భారీ వర్షం కారణంగా పలు మండలాల్లో చేతికి వచ్చిన వరి పంట నేలకొరిగింది. వనపర్తి మండలం చిట్యాల గ్రామ శివారులో గల మార్కెట్ యార్డుకు తెచ్చిన వరి, మొక్కజొన్న ధాన్యం తడిసి ముద్దయ్యింది.

దీంతో రైతులు తల్లడిల్లారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కాకపోవడంతో చాలా మంది రైతులు వారం పది రోజులుగా మార్కెట్ యార్డులోనే పడిగాపులు కాస్తున్నారు. ఎండిన ధాన్యాన్ని మార్కెట్‌కు తెచ్చిన , కురుస్తున్న అకాల వర్షాలకు తడిసిపోతుండడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గోపాల్‌పేట మండలంలోని తాడిపర్తి గ్రామానికి చెందిన రాజు అనే రైతు 6 ఎకరాలలో సన్నరకం వరి సాగు చేశారు. కొనుగోలు లేక గత ఐదు రోజులుగా మార్కెట్ యార్డులోని ధాన్యపు రాశులను కవర్లు కప్పి ఉంచారు. శనివారం కురిసిన భారీ వర్షానికి 8 ట్రాక్టర్ల వడ్లు పూర్తిగా తడిసి ముద్దయ్యాయి. దాదాపు లక్ష రూపాయలకు పైగా నష్టం జరిగిందని, పూర్తిగా తడిసిన ధాన్యంను మద్దతు ధరకు కొనుగోలు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాడు.

తక్కువ ధరకు అడుగుతుండ్రు



5 ఎకరాలలో మొక్కజొన్న సాగు చేశాను. ఐదు ట్రాక్టర్లు అయినవి. మార్కెట్‌కు తెచ్చి వారం రోజులు అవుతుంది. ప్రస్తుతానికి కొనుగోలు చేస్తలేరు. మొన్నటి వరకు క్వింటాల్ 1200 అడిగిండ్రు. ధర వస్తలేదు రోజూ కవర్లు తెరవడం, మూయడం జరుగుతుంది. రాత్రి కురిసిన వర్షానికి మక్కలు మొత్తం తడిసినవి. అధికారులు స్పందించి మద్దతు ధరకు కొనుగోలు చేయాలని కోరుతున్నాం.

- రైతు, బక్కన్న

మోస్తరు నుంచి భారీ వర్షం

» కౌకుంట్లలో 81 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు

మహబూబ్‌నగర్/ వనపర్తి/ గద్వాల/ నారాయణపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో శనివారం మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల వరి, పత్తి పంటలు నష్టం వాటిల్లుతోంది. రోడ్లపై ఆరబోసిన వరి, మార్కెట్లకు తెచ్చిన పత్తి తడిసిపోతోంది. పాలమూరు జిల్లాలో శుక్రవారం అర్ధరాత్రి తరువాత పలు మండలాలలో భారీ వర్షం కురిసింది. శనివారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. మరో రెండ్రోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ చెబుతుండటంతో పత్తిపంటతో పాటు కోతకు సిద్ధంగా వరి పంట రైతులు ఆందోళన చెందుతున్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలోని కౌకుంట్ల మండలంలో అత్యధికంగా 81మి.మీ, గండీడ్‌లో 58 మి.మీ, దేవరకద్రలో 44 మి.మీ, మహ్మదాబాద్‌లో 35మి.మీ, అడ్డాకుల, మూసాపేట మండలాలలో 32 మి.మీ, సీసీకుంటలో 24 మి.మీ, హన్వాడలో 18 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

వనపర్తి జిల్లా కొత్తకోటలో 59.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. గోపాల్‌పేటలో 55.6, మదనాపూర్‌లో 52.2, పెద్దమందడిలో 46.4, వనపర్తి 44.6, రేవల్లి 25.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

నారాయణపేట జిల్లా కొత్తపల్లి మండలంలో 56.5 మి.మీ. వర్షపాతం నమోదైంది. దామరగిద్ద మండలంలో 47.3 మి.మీ., మాగనూర్ మండలంలో 46.3, నారాయణపేట మండలంలో 41.3, గుండుమాల్ మండలంలో 36.3, కోస్గిలో 31.5, మరికల్‌లో 27.0, మక్తల్‌లో 21.3, ఊట్కూర్ మండలంలో 18.3, ధన్వాడలో 17.3, మద్దూర్‌లో 12.3 మి.మీ. వర్షపాతం నమోదైంది.

జోగుళాంబ గద్వాల జిల్లా రాజోలి మండలంలో 36.9 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. కేటీదొడ్డిలో 21.1, అయిజలో 20.8, వడ్డేపల్లిలో 11.7 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రం, ఉప్పునుంతల, పెంట్లవెల్లిలో కూడా వర్షం కురిసింది. మహబూబ్‌నగర్‌లో కూడా వర్షం కురిసింది.

యువకుడి ఆత్మహత్య



గాజుల మధు (ఫైల్)

నాగర్‌కర్నూల్ క్రైం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని నల్లవెల్లి రోడ్డులో శారద పాఠశాల సమీపంలో గల గాజుల మధు(22)ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు స్థానికులు శనివారం తెలిపారు. వివరాల ప్రకారం... జిల్లా కేంద్రానికి చెందిన గాజుల మధు పట్టణంలో ఒక ఎలక్ట్రానిక్ షాపులో పని చేస్తున్నాడు. శుక్రవారం ఉదయం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఒంటిపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గుర్తించి చికిత్స నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లో ఉస్మానియా ఆసుపత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఈ సంఘటనపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

గొర్రెలపై దూసుకెళ్లిన బైక్

- కాపరికి తీవ్ర గాయాలు, రెండు గొర్రెలు మృతి

నాగర్‌కర్నూల్ క్రైం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ మండలంలోని వనపట్ల గేట్ సమీపంలో గొర్రెల మంద రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని బైక్ గొర్రెల కాపరి తిక్కన్నకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటనలో రెండు గొర్రెలు మృతి చెందిన సంఘటన శనివారం సాయంత్రం చోటు చేసుకున్నట్లు స్థానికులు తెలిపారు. వివరాల ప్రకారం... పెద్దకొత్తపల్లి మండలం వెన్నచెర్లకు చెందిన తిక్కన్న గొర్రెలు మేపుకుంటూ వనపట్ల గేటు సమీపంలో రోడ్డు దాటిస్తుండగా గుర్తు తెలియని బైక్ గొర్రెల కాపరి తిక్కన్నతో పాటు గొర్రెలను ఢీకొట్టాడు. ఈ సంఘటనలో తిక్కన్నకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనలో రెండు గొర్రెలు మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. ఈ సంఘటనపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ గోవర్ధన్‌ను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని విచారించి చర్యలు తీసుకుంటామన్నారు.

చికిత్స పొందుతూ రైతు మృతి



ఆంజనేయులు (ఫైల్)

గోపాల్‌పేట(ఏదుల), అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఏదుల మండలంలో ఓ రైతు తన పొలంలోనే గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా, చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. వనపర్తి జిల్లా ఏదుల మండల కేంద్రానికి చెందిన కొమ్ము ఆంజనేయులు (50) భార్య అంజనమ్మతో కలిసి వ్యవసాయం చేసుకుంటున్నాడు. తన పొలం పక్కన కార్మికులు ఉన్న గుడిసె కరెంటు తీగలను తొలగించాడు. దీంతో అదే గ్రామానికి చెందిన సబ్ కాంట్రాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, కేఎస్‌ఆర్ కంపెనీకి చెందిన సూపర్ వైజర్ శేఖర్ రెడ్డి ఆంజనేయులుతో గొడవకు దిగారు. అయితే, ఈనెల 23న ఆంజనేయులు తమ్ముడు రాములును కలిసిన సబ్ కాంట్రాక్టర్ మీ అన్నపై కేసులు పెడుతున్నామని, మీ అన్న అంతు చూస్తామని బెదిరించాడు. నువ్వు మధ్యలో రావద్దని అన్నాడు. సబ్ కాంట్రాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి ఆంజనేయులును పదే పదే బెదిరించడంతో గురువారం రాత్రి తన పొలంలో గడ్డి మందు తాగాడు.

చిన్న కూతురు జ్యోతికి ఫోన్ చేసి "సబ్ కాంట్రాక్టర్‌తో పాటు, సూపర్‌వైజర్ తనను ఇబ్బంది పెట్టి కేసులు పెడుతామని బెదిరిస్తున్నారని, వారి ఇబ్బందులు తట్టుకోలేక పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటున్నానని, వారిని విడిచి పెట్టొదని" కూతురికి చెప్పాడు. దీంతో ఆమె తన తల్లి ఆంజమ్మకు సమాచారం అందించింది. ఆమె పోలీసులకు తెలుపడంతో గోపాల్‌పేట, రేవల్లి పోలీసులు ఆంజనేయులు కోసం వెతికారు. సుమారు రెండు గంటల పాటు వెతకడంతో తన పొలంలోనే గడ్డి మందు తాగి అపస్మారక స్థితిలో పడి ఉన్నాడు. అక్కడి నుంచి వనపర్తి ఏరియా ఆసుపత్రి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండంతో మెరుగైన చికిత్స కోసం హైదరాబద్‌లఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆంజనేయులు శుక్రవారం మృతి చెందాడు. భార్య ఆంజమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పేరుకుపోతున్నాయి..

(5వ పేజీ తరువాయి)

చుట్టూ తిరుగుతున్నారు. అత్యధికంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 27323 దరఖాస్తులు రాగా.. కేవలం 3 శాతం మాత్రమే పరిష్కారమయ్యా యి. ఆ తర్వాత ఖమ్మంలో 26,480 దరఖాస్తులు రాగా.. 9 శాతం మా త్రమే పరిష్కారమయ్యాయి. అత్యల్పంగా జోగులాంబ గద్వాలలో 4,035 దరఖాస్తులు రాగా.. ఇక్కడ 3,165 దరఖాస్తులను పరిష్కరించి.. 78 శాతం సాధించారు. ఆ తర్వాతి స్థానంలో రాజన్న సిరిసిల్ల జిల్లా ఉంది. అయితే ఈ దరఖాస్తుల్లో సాదాబైనామా, అసైన్డ్ భూములకు సంబంధించిన దరఖాస్తులు లేకపోయినప్పటికీ.. అధికంగా డేటా కరెక్షన్ సమస్య లే అయినప్పటికీ.. దరఖాస్తుల పరిష్కారంలో మాత్రం తీవ్రంగా జాప్యం జరుగుతోంది.

భూభారతి పోర్టల్‌లోనూ పెండెన్సీ...:

భూభారతి పోర్టల్‌ను ప్రారంభించిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా దాని ద్వారానే దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. అయితే స్వీకరించిన వాటిలో సగం కూడా పరిష్కారం కావడం లేదు. ప్రస్తుతం భూభారతి కింద రాష్ట్ర వ్యాప్తంగా 95585 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా.. అత్యధికంగా తహశీల్దార్ల వద్ద 53907, ఆర్డీఓల వద్ద 18381, అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) వద్ద 11500, కలెక్టర్ల లాగిన్‌లో 11797 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. అత్యధికంగా తహశీల్దార్ల నుంచి ఫిర్యాదుల ఫైళ్లు కదలడం లేదు. అయితే కోర్టు కేసులో లేక.. ఇతర క్లిష్టమైన వివాదాలు లేని దరఖాస్తులే పరిష్కారానికి నోచుకోవడం లేదని చెప్పవచ్చు. మొత్తం 14 మాడ్యూల్స్‌లో కేవలం రెండు విభాగాల్లో మాత్రమే భారీగా ఫిర్యాదులు పేరుకుపోతున్నాయి. డేటా కరెక్షన్‌కు సంబంధించి ప్రస్తుతం 42178 దరఖాస్తులు పెండింగ్‌లో ఉండగా.. అందులో తహశీల్దార్ల వద్ద 25345, ఆర్డీఓల వద్ద 5730, అడిషనల్ కలెక్టర్ల వద్ద 3612, కలెక్టర్ల వద్ద 7491 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

డేటా కరెక్షన్‌తోపాటు నిషేధిత జాబితాలో ఉన్న భూములకు సంబంధించిన ఫిర్యాదులు కూడా పరిష్కారానికి నోచుకోవడం లేదు. ఈ విభాగంలో ప్రస్తుతం 23998 ఫిర్యాదులు రాగా.. తహశీల్దార్ల వద్ద 8285, ఆర్డీఓల వద్ద 3911, అడిషనల్ కలెక్టర్ల వద్ద 7608, క లెక్టర్ల వద్ద 4194 ఫిర్యాదులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ రెండు విభాగాలతోపాటు అర్బన్ ల్యాండ్‌కు సంబంధించిన ఫిర్యాదులు మాత్రమే కలెక్ట ర్ల వద్ద పెండింగ్‌లో ఉండగా.. మిగతా విభాగాల్లో ఒక్క దరఖాస్తు కూడా పెండింగ్ లేకపోవడం గమనార్హం.

పోలీస్ స్టేషన్‌కు చేరిన టెండర్ వ్యవహారం

ఈవోపై ఫిర్యాదు చేసిన టెండరుదారు..

అలంపూర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ ఆలయంలో వేసిన కూరగాయల టెండరు వివాదం పోలీస్‌స్టేషన్‌కు చేరింది. కూరగాయలు సరఫరా చేసేందుకు టెండరు దాఖలు చేసిన వై.శ్రీలత శుక్రవారం రాత్రి అలంపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఈవోపై ఫిర్యాదు చేసింది. తక్కువ కోట్ చేసి టెండర్ దక్కించుకున్నా మాదిగ కులం కావడం చేతనే రద్దు చేసిన ఈవో దీప్తిపై చర్యలు తీసుకొని ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేయాలని ఫిర్యాదు చేశారు.

భక్తిశ్రద్ధలతో శనీశ్వరస్వామికి తిల తైలాభిషేకాలు



నందివడ్డెమాన్‌లో శనీశ్వర స్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు

బిజినేపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నందివడ్డెమాన్‌లోని శనీశ్వర స్వామికి శనివారం భక్తులు భక్తిశ్రద్ధలతో తిల, తైల అభిషేకాలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు డాక్టర్ గవ్వమఠం విశ్వనాథ శాస్త్రి మాట్లాడుతూ భక్తుల జన్మ, గోత్ర రీత్యా గ్రహ దోషాలు తొలగుటకు శనిగ్రహ శాంతి కోసం శనీశ్వర స్వామిని శనివారం నాడు పూజించాలని సూచించారు.

శనీశ్వర స్వామిని నల్లని వస్త్రాలు ధరించి నల్ల నువ్వులు, నువ్వుల నూనె, జిల్లెడు ఆకులు, పూలు, జమ్మి ఆకులతో పూజించాలని తెలిపారు. అనంతరం రుద్ర శివుడి ఆలయంలో అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు భక్తులు నిర్వహించారు.

వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కల్గకుండా ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు గోపాల్‌రావు, వీరశేఖర్, ప్రభాకరాచారి, అర్చకులు గవ్వమఠం శాంతి కుమార్, ఉమ్మయ్య, జయంత్, సిబ్బంది గోపాల్ రెడ్డి తదితరులు ఉన్నారు.

క్రైం కార్నర్

పేరపల్ల అటవీ ప్రాంతంలో చిరుత మృతి

- నాలుగు రోజుల క్రితం చిరుత మృతదేహం గుర్తింపు
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఫారెస్ట్ అధికారులు
- పోస్టుమార్టం కోసం తరలింపు



పేటలో మృతి చెందిన చిరుతకు పోస్టుమార్టం నిర్వహిస్తున్న పశు వైద్యుడు అనిరుథ్, శ్రీనివాస్ తదితరులు

నారాయణపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): నారాయణపేట మండలంలో పేరపల్ల గ్రామ గుట్టల ప్రాంతంలో ఓ చిరుత మృతి చెందింది. నాలుగు రోజుల క్రితం మృతి చెందిన చిరుత పులి దుర్వాసన రావడంతో ఓ పశువుల కాపరి అటవీ శాఖ బీట్ అధికారి సంతోష్‌కు శనివారం సమాచారం ఫోన్ ద్వారా అందించారు. చిరుతపులి మృతి చెందిన విషయం తెలుసుకున్న గ్రామస్థులు భయాందోళనకు గురయ్యారు. దాంతో అటవీశాఖ రేంజ్ అసిస్టెంట్ అధికారి కమాలొద్దీన్‌తో పాటు బీట్ అధికారి పేరపల్ల గుట్టల ప్రాంతం చెట్ల మధ్య మృతి చెందిన చిరుత మృతదేహాన్ని పరిశీలించారు. అయితే, చిరుతకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో పాటు గోర్లు, కళ్లు, దంతాలు ఉండడంతో చిరుత నాలుగేళ్ల వయస్సు ఉంటుందని, అనారోగ్యంతో మృతి చెంది ఉండవచ్చని అటవీ శాఖ అధికారులు భావిస్తున్నారు. చిరుత మృతదేహాన్ని జిల్లా కేంద్రంలోని ఫారెస్ట్ కార్యాలయ పరిసరాల్లోకి తరలించి పశువైద్యుడు అనిరుధ్ పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం అటవీ శాఖ సిబ్బంది కాల్చివేశారు.

వర్షం ధాటికి బలైన 20 గొర్రెలు



అలంపూర్‌లో చనిపోయిన గొర్రెలతో రైతు వెంకటేష్

అలంపూర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): అలంపూరు పట్టణానికి చెందిన కురువ వెంకటేష్ అనే గొర్రెల కాపరి పొలంలో ఆపిన గొర్రెల మందపై శుక్రవారం రాత్రి కురిసిన వర్షం ప్రభావం చూపింది. కొన్ని రోజులుగా కురుస్తున్న అకాల వర్షాల కారణంగా శనివారం ఉదయం 20 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. ఇంత కాలం గొర్రెలపైనే జీవనం కొనసాగిస్తున్న తనకు అకస్మాత్తుగా వాటిని కోల్పోవడం బాధగా ఉందని వాపోయారు. ప్రభుత్వం ఆదుకోవాలని రైతు విజ్ఞప్తి చేశారు.

కారు బోల్తా : ఒకరి మృతి

- నలుగురికి గాయాలు



బోల్తా పడిన కారు

మానవపాడు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి 44పై కారు బోల్తా పడి ఒకరు మృతి చెందగా, మరో నాలుగురికి గాయాలైనట్లు ఎస్ఐ చంద్రకాంత్ తెలిపారు. ఈ ఘటనపై ఎస్ఐ చంద్రకాంత్ తెలిపిన వివరాల మేరకు.. కర్నూల్ జిల్లా లక్ష్మీపురం గ్రామానికి చెందిన ఐదు గురు కారులో కర్నూల్ నుంచి హైదరబాద్‌కు శనివారం జాతీయ రహదారి 44పై ప్రయాణం చేస్తున్నాడు. జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు మండల పరిధిలోని బోరవెల్లి స్టేజి సమీపంలోని సాల్ట్ హోటల్ దగ్గర సాయంత్రం కారు అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న కళావతమ్మ (60) మృతి చెందగా, సైమన్‌రాజు, మనోజ్‌కుమార్, బేబీ స్టెఫీ, ఫియాపాపలకు గాయాల య్యాయి. 108 సహాయంతో కర్నూల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చంద్రకాంత్ తెలిపారు.

చికిత్స పొందుతూ వివాహిత..

ఆత్మకూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ వివాహిత మృతి చెందిన సంఘటన వనపర్తి జిల్లా ఆత్మకూరు మండల పరిధిలోని మేడపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు, ఆత్మకూరు ఎస్ఐ నరేందర్ తెలిపిన వివరాల ప్రకారం... మేడపల్లి గ్రామానికి చెందిన భారతమ్మ (30)ను తిప్పడంపల్లి గ్రామానికి చెందిన శివకు ఇచ్చి 13 సంవత్సరాల క్రితం వివాహం జరిపించారు. గత కొంతకాలంగా భార్యాభర్తల మధ్య ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో గొడవపడి భారతమ్మ తల్లి ఇంటికి వెళ్లింది. ఈ క్రమంలో ఈనెల 24వ తేదీన ఉదయం 11 గంటల సమయంలో ఎవరూ లేని సమయంలో పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ క్రమంలో చుట్టుపక్కల వారు గమనించి ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో పాలమూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలి తల్లి గొల్ల సత్యమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..



ఈశ్వర్‌రెడ్డి (ఫైల్)

కల్వకుర్తి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించిన వివరాల ప్రకారం... కల్వకుర్తి పట్టణంలోని బాలరామ్‌నగర్ కాలనీకి చెందిన మొతది ఈశ్వర్‌రెడ్డి(49)మండల పరిధిలోని మార్చాల సమీపంలో రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది.

ప్రమాదంలో మొతది ఈశ్వర్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన స్థలానికి ఎస్ఐ మాధవరెడ్డి వెళ్లి వివరాలు సేకరించారు. మృతుడికి కుటుంబ సభ్యులు ఎవరూ లేరు. సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

రైస్ మిల్లులో చోరీ - కేసు నమోదు

కోస్గి రూరల్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కోస్గి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న ఓ రైస్ మిల్లులో ఆదివారం రాత్రి చోరీ ఘటన చోటు చేసుకొంది. ఎస్ఐ బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తు తెలియని వ్యక్తి మండల పరిధిలోని చంద్రవంచ గేటు సమీపంలో ఉన్న భాగ్యలక్ష్మీ రైస్ మిల్లు ఆవరణలో ఉన్న గది తాళం పగులగొట్టి సంచులు కుట్టే మిషన్, పైపులు కట్ చేసే మిషన్‌లను దొంగిలించాడు. రైస్ మిల్లు యజమాని రవికుమార్ ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

క్రీడా రంగంలో మహిళామణులు

- క్రికెట్ అకాడమీలో శిక్షణ..
- రాష్ట్ర, జాతీయ స్థాయిలో సత్తాచాటుతున్న మహిళా క్రికెటర్లు



వనపర్తి గిరిజన బాలికల క్రికెట్ అకాడమీలో శిక్షణ ఇస్తున్న కోచ్ మన్నాన్

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రతిభ గల క్రీడాకారులకు కొదవ లేదు. ఎంతో మంది క్రీడాకారులు ప్రతీ క్రీడల్లో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నారు. క్రికెట్‌లో సైతం మహబూబ్‌నగర్ యువత సత్తా చాటుతోంది. గతంలో గౌస్‌బాబా రంజీ మ్యాచ్‌లతో పాటు ఇంగ్లండ్ కౌంటీలు ఆడగా, ప్రస్తుతం మరో క్రీడాకారుడు గణేష్ రంజీ జట్టుకు ఎంపిక కావటంతో ఇంగ్లాండ్ కౌంటీలు ఆడాడు. ఇదే స్ఫూర్తితో మహబూబ్‌నగర్ మహిళలు సైతం క్రికెట్‌లో సత్తాచాటుతున్నారు. ఉమ్మడి జిల్లా స్థాయిలో టోర్నీలో పరుగుల వరద పారించడంతో పాటు వికెట్లు తీస్తూ రాణిస్తున్నారు. ఎండీసీఏ ఆధ్వర్యంలో సైతం మహిళా క్రికెటర్లకు శిక్షణ అందజేసి ప్రొత్సహిస్తున్నారు. అలాగే వనపర్తి జిల్లా కేంద్రంలోని గిరిజన బాలికల క్రికెట్ అకాడమీలో శిక్షణ పొందుతున్నారు. అకాడమీలో విద్యార్థులు రాష్ట్ర, జాతీయ స్థాయి టోర్నీలకు ఎంపికై ప్రతిభ కనమరుస్తున్నారు. క్రికెట్‌లో రాణిస్తున్న ఉమ్మడి జిలా మహిళా క్రికెటర్లపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనం.

ఆల్ రౌండర్...

కోస్గి మండలం హన్మాన్‌పల్లి తండాకు చెందిన అనిత మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని గిరిజన గురుకులంలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. వనపర్తి జిల్లా కేంద్రంలోని గిరిజన బాలికల క్రికెట్ అకాడమీలో కోచ్ మన్నాన్ వద్ద శిక్షణ పొందుతున్నది. మహిళా క్రికెట్ టోర్నీలో ఆడి ప్రతిభ చాటుతున్నారు. ఒకే మ్యాచ్‌లో 45 పరుగులు, 2 వికెట్లు, మారో మ్యాచ్‌లో 11 పరుగులు 2 వికెట్లు తీసి ఆల్‌రౌండర్‌గా రాణించింది. 2021లో హెచ్‌సీఏ మహిళ జట్టుకు ఎంపికై గుజరాత్ రాష్ట్రం సూరత్‌లో నిర్వహించి టోర్నీ ఆడింది. బెంగళూరులో నిర్వహించిన టీ-20 పోటీల్లోనూ హెచ్‌సీఏ జట్టుకు ప్రాతినిధ్యం వహించింది.



ఫాస్ట్ బౌలర్‌గా...



ఖిల్లాఘనపురం మండల మామిడిమాడకు చెందిన దివ్య రాథోడ్ వనపర్తిలోని గిరిజన గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నది. క్రీడల్లో ఆసక్తిని చూసి తండ్రి ప్రోత్సహించడంతో కోచ్ మన్నాన్ వద్ద శిక్షణ తీసుకుంటూ మహిళా టోర్నీల్లో ప్రతిభ చాటింది. మొదటి మ్యాచ్‌లో 2, రెండో మ్యాచ్‌లో 5 వికెట్లు తీసింది. ఫాస్ట్ బౌలర్‌గా రాణిస్తున్న దివ్య గత ఏడాది ఖమ్మంలో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ అండర్-17 రాష్ట్రస్థాయి టోర్నీలో ప్రతిభ చాటింది. ఎండీసీఏ టోర్నీల్లో రాణించింది.

బౌలర్‌గా రాణిస్తోంది...



అచ్చంపేట మండలం రంగాపూర్‌కు చెందిన ఎం.మహేశ్వరి షాద్‌నగర్‌లోని గిరిజన గురుకులంలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. వనపర్తిలో క్రికెట్ అకాడమీలో కోచ్ మన్నాన్ వద్ద శిక్షణ తీసుకుంది. మహిళా టోర్నీలో రాణించింది. రెండు మ్యాచ్‌ల్లో 6 వికెట్లు తీసి ఉత్తమ బౌలర్‌గా అవార్డు అందుకుంది. హైదరాబాద్‌లో నిర్వహించిన హెచ్‌సీఏ అండర్-19 రాష్ట్రస్థాయి టోర్నీలో హెచ్‌సీఏ జట్టు తరపున 3 మ్యాచ్‌లు ఆడింది. 2024లో అంతర్ విశ్వవిద్యాలయాల స్థాయి క్రికెట్ టోర్నీలో పాలమూరు యూనివర్సిటీ జట్టుకు ప్రాతినిధ్యం వహించింది.

వికెట్ కీపర్, బ్యాటర్‌గా...



మహమ్మదాబాద్ మండలం మంగంపేటకు చెందిన ప్రతీక తాండూరులో 9వ తరగతి చదువుతోంది. హైదరాబాద్‌లోని కేఎస్ఎం క్లబ్‌లో రెండేళ్లుగా శిక్షణ తీసుకుంది. వికెట్ కీపర్, బ్యాటర్‌గా రాణిస్తోంది. మహిళా లీగ్ పోటీల్లో ప్రతిభ కనబరుస్తున్నది. ఒక మ్యాచ్‌లో 27, రెండో మ్యాచ్‌లో అర్ధసెంచరీ(68 పరుగులు) చేసింది. గత ఏడాది అండర్-15 టోర్నీలో హెచ్‌సీఏ జట్టుకు ఎంపికై ఆంధ్ర, తమిళనాడు జట్లతో తలపడింది.

భారత జట్టుకు ఆడాలి..



వవపర్తిలో గిరిజన బాలికల క్రికెట్ అకాడమీ 2018లో నెలకొల్పారు. 2018 నుంచి 2025 వరకు ఎంతో మంది మహిళా క్రికెటర్లకు శిక్షణ ఇచ్చాను. రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ చాటారు. హెచ్‌సీఏ టోర్నీలకు 6, జాతీయ స్థాయి టోర్నీలకు 30 మంది ఎంపికై ప్రతిభ చాటారు. ఈ నెల 26 నుంచి నవంబరు 2వ తేదీ వరకు ముంబయిలో జరిగే బీసీసీఐ టీ-20 టోర్నీలో పాల్గొనే హెచ్‌సీఏ అండర్-19 జట్టుకు అకాడమీ విద్యార్థిని పార్వతి ఎంపికైంది. అకాడమీ మహిళా క్రికెటర్లు భారత జట్టుకు ఆడాలన్నదే నా కల.

- ఎంఏ మన్నాన్, వనపర్తి గిరిజన బాలికల క్రికెట్ అకాడమీ కోచ్

హెచ్‌సీఏ సహకారంతో..



హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) మొదటిసారి మహిళా క్రికెటర్లను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ఈ ఏడాది జూన్‌లో మహిళా టోర్నీల నిర్వహణకు శ్రీకారం చుట్టింది.

ఉమ్మడి జిల్లా నుంచి 60 మంది మహిళా క్రికెటర్లను ఎంపిక చేసి ఉమ్మడి జిల్లా పోటీలు నిర్వహించాం. ఎంతో మంది ప్రతిభ చాటి హెచ్‌సీఏ జట్టులో చోటు దక్కించుకున్నారు.

- ఎం. రాజశేఖర్, జిల్లా క్రికెట్ సంఘం ప్రధాన కార్యదర్శి

బడుగు వర్గాలకు రాజ్యాధికారమే ధ్యేయం

- తెలంగాణ రాష్ట్రీయ లోక్‌దళ్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ కె.దిలీప్‌కుమార్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ రాష్ట్రీయ లోకదళ్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ కే దిలీప్‌కుమార్

కందనూలు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బడుగు వర్గాలకు రాజ్యాధికారమే ధ్యేయంగా తెలంగాణ రాష్ట్రీయ లోక్‌దళ్ పార్టీ పని చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ కే దిలీప్‌కుమార్ అన్నారు. నాగర్‌కర్నూల్ తెలంగాణ రాష్ట్రీయ లోక్‌దళ్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన రథ యాత్రలో భాగంగా శనివారం నాగర్‌కర్నూల్ చేరుకుంది. స్థానిక ఓ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను విస్మరించిందని ఆయన ఆరోపించారు. తక్షణమే ఎన్నికల మ్యానిఫెస్టోలో పెట్టిన అంశాలన్నింటినీ అమలుపర్చాలని డిమాండ్ చేశారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా తెలంగాణ రాష్ట్రీయ లోక్‌దళ్ పార్టీ అన్ని స్థానాలకు పోటీ చేస్తుందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రీయ లోక్‌దళ్ పార్టీ రాష్ట్ర నాయకులు బీరప్ప, జానీ, నర సింహారావు, రిషీష్, సుధాకర్, వీరస్వామి పా ల్గొన్నారు.

బీసీలకు 42శాతం రిజర్వేషన్లను అమలుపర్చాలి

కల్వకుర్తి, (ఆంధ్రజ్యోతి) : బీసీలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 42శాతం రిజర్వేషన్లు అమలుపర్చాలని ఆర్ఎల్‌డీ రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్‌కుమార్ డిమాండ్ చేశారు. బీసీలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సామాజిక తెలంగాణ ధ్యేయంగా దక్షిణ తెలంగాణ యాత్రలో భాగంగా నిర్వహిస్తున్న రథయాత్ర శనివారం కల్వకుర్తికి చేరు కుంది. ఈ సందర్భంగా అంబేడ్కర్ విగ్రహానికి బీసీ సంఘాల నాయకులతో కలిసి పూల మాల వేసి నివాళులర్పించారు. బీసీ జేఏసీ నాయకులు రాజేందర్, జంగయ్య, సదానందం గౌడ్, గోపాల్, రమేష్‌బాబు పాల్గొన్నారు.

మురికి కాలువలో శిశువు మృతదేహం

బాలానగర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): బాలానగర్ కేంద్రంలో గుర్తు తెలియని వ్యక్తులు అప్పుడే పుట్టిన మగ శిశువు మృతదేహాన్ని పడేశిన ఘటన శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మండల కేంద్రానికి చెందిన లక్ష్మారెడ్డి వ్యవసాయ భూమి సమీపంలోని మురికి కాలువలో మగ శిశువు మృతదేహాన్ని పడవేశారు. స్థానికులు పచాయతీ కార్యదర్శి జగన్‌నాయక్‌కు సమాచారం ఇవ్వడంతో ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

'ధన్-ధాన్య' ద్వారా మూడు జిల్లాల అభివృద్ధి

- మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ

నారాయణపేట న్యూటౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం దేశంలో వెనుకబడిన వంద జిల్లాల్లో ధన్-ధాన్య కృషి యోజన పథకం ఇటీవలే ప్రవేశపెట్టగా, అందులో నారాయణపేట, నాగర్‌కర్నూల్, జోగుళాంబ గద్వాల జిల్లాలను ఎంపిక చేసిందని మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. ఈ జిల్లాలు వ్యవసాయ రంగంలో అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. శనివారం బీజేపీ రాష్ట్ర నాయకుడు కె.రతంగ పాండురెడ్డి షష్టిపూర్తి కార్యక్రమానికి హాజరైన ఆయన స్థానిక అ తిథి గృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దేశ ప్రజలకు దీపావళి కానుకగా కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని తగ్గించి పేదవారి జీవితాల్లో వెలుగులు నింపిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ తీసుకురావడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. పార్లమెంట్‌లో చట్టం చేస్తేనే రిజర్వేషన్లు అమ లవుతాయన్నారు. ఈ చట్టం చేయడానికి దేశం లోని అన్ని పార్టీలు మద్దతు తెలుపాలని కోరారు. అనంతరం పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం సభ్యుడు నాగూరావు నామాజీ మాట్లాడుతూ దత్తాత్రేయ ఎల్లవేళలా నారా యణపేట జిల్లా ప్రజలకు, నాయకులకు సహాయ సహకారాలు అందిస్తున్నారని గు ర్తుచేశారు.

పార్టీ జిల్లా అధ్యక్షుడు కె.సత్యయాదవ్, సీనియర్ నాయకులు కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

పులికల్‌లో నకిలీ మందుల కలకలం

- విచారించిన వ్యవసాయ, పోలీసు అధికారులు
- రూ. 5 లక్షల విలువ చేసే మందులు స్వాధీనం



విచారిస్తున్న మండల వ్యవసాయాధికారి, ఎస్ఐ

అయిజ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జోగుళాంబ గద్వాల జిల్లా అయిజ మండల పరిధిలోని పులికల్ గ్రామంలో నకిలీ మందుల తయారీ కలకలం రేపుతోంది. సమాచారం తెలిసిన సీఐ టాటాబాబు, ఎస్ఐ శ్రీనివాసరావులు, మండల వ్యవసాయాధికారి జనార్దన్‌లు శనివారం పులికల్ గ్రామం చేరుకుని విచారించారు. పులికల్ గ్రామానికి చెందిన గొల్ల బత్తిని వీరేష్ అనే వ్యక్తి ఒక గోడౌను ఏర్పాటు చేసుకుని అనుమతులు లేకుండా నకిలీ మందుల తయారు చేస్తున్నారని సీఐ తెలిపారు. సూపర్ సింబోల మైక్రోన్యూట్రింట్ కంపెనీ పేరు మీదు నేమ్ ప్లేట్ ఏర్పాటు చేసి మందుల తయారీకి పాల్పడుతున్నట్లు తెలియచేశారు. నకిలీ పురుగుల మందుకు లేబుళ్ల తగిలించి విక్రయిస్తున్నట్లు సీఐ తెలిపారు. వాటి విలువ దాదాపు రూ.4,66,820 విలువ ఉంటుందని తెలిపారు. ఎలాంటి అనుమతులు లేకుండా తయారు చేస్తున్నందుకు జప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ వ్యాపారం దాదాపు 15 సంవత్సరాలుగా ఈ గ్రామంలో సాగిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు.

25 రకాల మందుల వివరాలు

అనుమతులు లేకుండా కంపెనీ ఏర్పాటు చేసుకుని అందులో 25 రకాల మందుల పేరిట మార్కెట్‌లో విక్రయిస్తున్నట్లు తెలిపారు.

ఆకుకూరలకు సంబంధించి జేసీఎస్ రైన్‌బో ఎస్పీ ఆర్గానిక్ ప్రొడక్ట్స్ పేరున, పళ్లు (ఫ్రూట్స్)కు సంబంధించి పెంటాక్ ప్లస్, మొక్కలకు సంబంధించి బయోజైమ్, పత్తి పంటకు సంబంధించి కింగ్, వీటా ఎక్స్‌ట్రా ఇలా కంపెనీల లేబుళ్లతో విక్రయిస్తున్నట్లు పేర్కొన్నారు.

కొనసాగుతున్న జల విద్యుత్ ఉత్పత్తి

ఆత్మకూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): ఎగువ నుంచి ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు స్వల్పంగా వరద వస్తున్న కారణంగా ఎగువ దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల్లో నాలుగు యూనిట్లను ప్రారంభించి విద్యుత్ ఉత్పత్తిని కొనసాగిస్తున్నట్లు ఎగువ దిగువ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ఎస్పీ శ్రీధర్ ప్రకటనలో తెలిపారు. ఎగువ జూరాల ఉత్పత్తి కేంద్రంలో రెండు యూనిట్ల ప్రారంభించి 1.407 మిలియన్ యూనిట్లను చేపట్టగా ఇప్పటివరకు 450.989 మిలియన్ యూనిట్లను చేపట్టినట్లు తెలిపారు.

అలాగే దిగువ జూరాల ఉత్పత్తి కేంద్రంలో రెండు యూనిట్లను ప్రారంభించి 1.560 మిలియన్ యూనిట్లను చేపట్టగా ఇప్ప టివరకు 439.103 మిలియన్ యూనిట్లను చేపట్టినట్లు తెలిపారు. ఈ ఏడాది వరద ముందుగానే ప్రారంభం కావడంతో ఉత్పత్తిని కూడా ప్రారంభించామని తెలిపారు.

సుంకేసుల జలాశయానికి పెరిగిన వరద

● 70 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో...



సుంకేసుల జలాశయం నుంచి విడుదల అవుతున్న వరద నీరు

రాజోలి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన రాజోలి శివారులో ఉన్న సుంకేసుల జలాశయానికి వరద పెరిగింది. శుక్రవారం కురిసిన భారీ వర్షాల కారణంగా శనివారం మధ్యాహ్నం డ్యాంకు 70,000 క్యూసెక్కుల నీరు ఎగువ నుంచి వచ్చి చేరుకుంది. దీంతో సుంకేసుల జలాశయం నుంచి 15 గేట్లు ఒక మీటర్ ఎత్తుకు తెరిచి 67,900 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు, కేసీ కెనాల్‌కు 1900 క్యూసెక్కుల నీరు విడుదల అవుతున్నట్లు డ్యాం జేఈ మహేశ్వర్ రెడ్డి తెలిపారు. డ్యాం సామర్థ్యం 1.20 టీఎంసీ కాగా ప్రస్తుతం 1.110 టీఎంసీగా ఉందని, నీటి నిల్వ 292.00 మీటర్లు కాగా ప్రస్తుతం 291.70 మీటర్లు నమోదు అయినట్లు డ్యాం అధికారులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఎస్ఐ వినోద్‌కుమార్‌కు తీవ్ర గాయాలు

- మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలింపు

నాగర్‌కర్నూల్ క్రైం, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో నాగర్‌కర్నూల్ రెండవ ఎస్ఐ వినోద్‌కుమార్‌కు తీవ్ర గాయాలైనట్లు ఎస్ఐ గోవర్ధన్ శనివారం తెలిపారు. వివరాల ప్రకారం.. నాగర్‌కర్నూల్ రెండవ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న వినోద్‌కుమార్ కొల్లాపూర్ చౌరస్తా నుంచి పోలీస్‌స్టేషన్‌కు వస్తుండగా వర్షం వస్తుండడంతో ట్రాక్టర్ రోడ్డు పక్కన ఆపి ఉండడం కన్పించకపోవడంతో వెనకాల నుంచి వచ్చి ట్రాక్టర్‌ను ఢీకొట్టారు. ఈ సంఘటనలో ఎస్ఐ వినోద్‌కుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ హాస్పిటల్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. ప్రస్తుతం అతని ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోవర్ధన్ తెలిపారు.

ఇంటర్వ్యూ..

యుద్ధ ప్రాతిపదికన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తి కావాలి

- ఆంజనేయులు, ఎంపీడీవో



తాడూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఇల్లు లేని పేద ప్రజలకు సొంత ఇల్లు నిర్మించాలనే దృఢ సంకల్పంతో ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు చేస్తున్నదని ఎంపీడీవో ఆంజనేయులు అన్నారు. మండలంలో మంజూరైన ఇళ్లను లబ్ధిదారులు నిర్మించుకునేలా క్షేత్రస్థాయిలో సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూలో ఆయన స్పష్టం చేశారు.

మండల వ్యాప్తంగా ఎన్ని ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి ?

తాడూరుతో పాటు మండలంలోని 24 గ్రామ పంచాయతీల పరిధిలో 543 ఇందిరమ్మ ఇళ్లు ప్రభుత్వం మంజూరు చేసింది.

ఇప్పటి వరకు ఎన్ని ఇళ్ల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి ?

మండలంలో మంజూరైన మొత్తం ఇళ్లల్లో ఇప్పటి వరకు 350 ఇళ్లకుపైగా నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. వీటిలో వందకు పైగా ఇళ్లు శ్లాబులు పూర్తయ్యాయి. మిగిలిన ఇళ్లు బేస్‌మెంట్, లెంటల్ లెవల్లో పనులు జరుగుతున్నాయి. మండలంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంబంధించి హౌసింగ్ ఏఈ, పంచాయతీ కార్యదర్శులు లబ్ధిదారుల సహకారంతో త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.

న్యూస్ బాక్స్

కురుమూర్తి జాతరకు ప్రత్యేక బస్సులు : డీఎం

కొల్లాపూర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలంలో వెలిసిన కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఈనెల 27 నుంచి 29 వరకు కొల్లాపూర్ ఆర్టీసీ బస్సు డిపో నుంచి జాతరకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ ఉమా శంకర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 27వ తేదీన ఐదు బస్సులను, ఉద్దాల రోజు 28న పది బస్సులను జాతరకు నడుపుతున్నట్లు తెలిపారు. భక్తుల రద్దీని బట్టి మరిన్ని ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు తెలిపారు. డిపో పరిధిలోని ఆయా గ్రామాల ప్రజలు, భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు'

బిజినేపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : అర్హులకే ఇందిరమ్మ ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేస్తుందని నాయబ్ తహసీల్దార్ చిక్కుడు రవికుమార్ అన్నారు. మండలంలోని చిన్నపీరు తండా, మీట్యాతండా పంచాయతీల పరిధిలోని భీముడి తండా, పుల్‌సింగ్ తండాల్లో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారుల ఆర్థిక పరిస్థితులపై శనివారం క్షేత్ర పరిశీలన చేసి మాట్లాడారు. స్థానికంగా నివాసం ఉండి స్వంత ఇల్లు లేని నిరుపేదల కు ఇందిరమ్మ ఇళ్లు ప్రభుత్వం మొదటి ప్రాధాన్యతతో మంజూరు చేసినట్లు తెలిపారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి చిన్నయ్య, గోవిందు నాయక్, మాన్యానాయక్, రాజు నాయక్, గోపాల్‌నాయక్, లబ్ధిదారులు ఉన్నారు.

పీఆర్‌టీయూ టీఎస్ మండల కమిటీ ఎన్నిక

ఉప్పునుంతల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : పీఆర్‌టీయూ టీఎస్ మండల కార్యవర్గం జిల్లా అధ్యక్షుడు దొడ్ల సత్యనారాయణ, ఆధ్వర్యంలో శనివారం ఎనుకున్నారు. అధ్యక్షుడిగా ఎండీ అమీర్‌పాషా, ప్రధాన కార్యదర్శిగా రాజవర్ధన్‌రెడ్డిలను ఎనుకున్నారు. జిల్లా నాయకులు సభావట్ బిచ్యానాయక్, తుమ్మల సురేందర్‌రెడ్డి, రామచంద్రరావు, సూర్య శ్రీనివాసుగౌడ్, మల్లికార్జున్, శ్యాంసుందర్‌గౌడ్, అజ్మతుల్లా, శ్రీధర్, అశోక్‌రెడ్డి, సభ్యులు నరసింహారెడ్డి, శ్రీనివాస్, రామచంద్రారెడ్డి, సురేందర్, గోపి, జంగయ్య, బుచ్చయ్య ఉన్నారు.

బీజేపీ బూత్ కమిటీ ఎన్నిక

అచ్చంపేటరూరల్, అక్టోబరు25 (ఆంధ్రజ్యోతి) : మండలం బుడ్డతండా గ్రామంలో శనివారం 149వ బూత్ అధ్యక్షుడిగా రమావత్ తులసీరామ్‌ను ఎన్నుకున్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి వరికుప్పల ఆంజనేయులు హాజరై కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకుని వెళ్లి గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. బీజేవైఎం నాయకులు బాలకృష్ణ యాదవ్, బీజేపీ మండల నాయకులు కేతావత్ బాబు, శేఖర్ పాల్గొన్నారు.

కొత్తకుంటపల్లి మాజీ సర్పంచ్ మృతి

లింగాల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని కొత్తకుంటపల్లి తాజా మాజీ సర్పంచ్ సొడమోని పర్వతాలు(49) శనివారం ఆకస్మికంగా మృతి చెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. పర్వతాలు కొన్ని రోజుల క్రితం ఇంట్లో చెప్పకుండా హైదరాబాద్ వెళ్లినట్లు తెలిపారు. శనివారం ఉదయం స్వగ్రామానికివచ్చిన ఆయన ఇంట్లో నిద్రిస్తుండగా హఠాన్మరణం చెందినట్లు తెలిపారు. కాగా ఆయన సర్పంచ్‌గా ఉన్న సమయంలో గ్రామంలో అప్పులు చేసి మరీ అభివృద్ధి పనులు చేపట్టినట్లు వెల్లడించారు. పర్వతాలు మృతిపై వివిధ గ్రామాల మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపీటీసీలు, వివిధ పార్టీల నాయకులు, కుల సంఘాల నాయకులు తీవ్ర దిగ్ర్భాంతిని వ్యక్తం చేశారు. ఆయన స్వగ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ పర్వతాలు పార్థివదేహం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి సంతాపం ప్రకటించారు.

జారిపడుతున్న ప్రజలు

- బురదమయమైన మారేడుగు ప్రధాన రహదారి

- పట్టించుకోని పాలకులు, అధికారులు

పదర, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : పెద్ద పెద్ద వర్షాలకే కాదు, కురుస్తున్న చిరుజల్లులకు కూడా రోడ్డంతా బురదమయంగా మారి, నడవడానికి రావడం లేదని మండలంలోని మారేడుగు గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మద్దిమడుగు ప్రధాన రహదారి మార్గంలో గుడెంపంపు మలుపు నుంచి మొర్సు తండా దాటిన తర్వాత మారేడుగు గ్రామానికి చేరుకునే ప్రాంతంలో ప్రధాన రహదారి వానల కు చిత్తడిగా దర్శనమిస్తుంది. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, వివిధ పనులకు రోడ్డు మార్గంలో వెళ్లే కూలీలు, వ్యవసాయదారులతో పాటు వివిధ రకాల పనుల మీద రోడ్డుపై వెళ్లే పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇక ద్విచక్ర వాహనదారులు బురదలో జారిపడుతున్న ఘటనలు చోటు చేసుకుంటున్నాయని గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతీసారి ఎన్నికల ముందు అన్ని పార్టీల నాయకులు గ్రామంలో తిరుగుతూ రోడ్డు వేస్తామని హామీలు ఇస్తారు కానీ అధికారంలోకి రాగానే పట్టించుకోవడం లేదని గ్రామస్థులు, తండావాసులు ఆరోపిస్తున్నారు. జరుగుతున్న ప్రమాదాలను దృష్టిలో పెట్టుకుని ఇప్పటికైనా పాలకులు, అధికారులు వెంటనే రోడ్డు పనులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. మారేడుగు గ్రామ శివారులో ఏర్పాటు చేయాల్సిన రహదారి విషయంపై ఆర్‌అండ్‌బీ అధికారికి ఆంధ్రజ్యోతి ఫోన్ చేయగా నెట్వర్క్ పరిధిలో లేదని తెలిపింది.



బురదమయమైన మారేడుగు రహదారి

బైక్‌పై నుంచి జారిపడుతున్నం



మా ఊర్లోకెళ్లే ముందర బస్సు రోడ్డు మొత్తం కంకర, ఎర్ర బురద ఉంది. వర్షం వచ్చిందంటే బైక్ స్కిడ్డై బురదలోనే పడుతున్నం. తొందరగా రోడ్డేస్తే బాగుంటది.

- కడారి తిరుపతి యాదవ్, మారేడుగు గ్రామ యువకుడు

రామాలయంలో నాగుల చవితి దీపారాధన

కందనూలు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్‌లోని రాంనగర్ కాలనీలోగల సీతా రామచంద్రస్వామి దేవాలయంలో కార్తీక మాసంలో వచ్చే నాగుల చవితికి ప్రత్యేక పూజలు చేశారు. కార్తీక మాసంలో నాల్గవ రోజు ప్రదోషకాలంలో భక్తులచే సామూహిక దీపారాధన, ఆకాశ దీపోత్సవం శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకుడు కందాడై వరదరాజన్ అయ్యంగార్, భక్తులు పాల్గొన్నారు.

● మన్ననూర్, (ఆంధ్రజ్యోతి) : అమ్రాబాద్ మండలం మన్ననూరు గ్రామంలో లింగమయ్య, వేణుగోపాల స్వామి ఆలయాల ఆవరణలో గల నాగులకు పూజలు చేసి పుట్టలో పాలు పోసి పూజలు చేశారు. కార్యక్రమంలో ఉమామహేశ్వర ఆలయ పాలక మండలి డైరెక్టర్ సంభు శోభ, వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు సంభు వెంకటరమణ, భక్తులు పాల్గొన్నారు.



శివస్వాములకు అన్నదానం చేస్తున్న మునిసిపల్ మాజీ చైర్మన్ ఎడ్మ సత్యం

అభయుడి ఆలయంలో భక్తుల సందడి

ఊర్కొండ, (ఆంధ్రజ్యోతి) : కార్తిక మాసం పురస్కరించుకొని మండలంలోని ఊర్కొండపేట అభయాంజనేయస్వామి ఆలయంలో భక్తులు పూజలు చేశారు. ఆలయ అధికారులు మారుతీరావు, వరలక్ష్మి, అర్చకులు దత్తాత్రేయశర్మ, ప్రవీణ్‌శర్మ, మహేష్‌శర్మ, శ్రీనివాస శర్మ ఉన్నారు.

● చారకొండ, (ఆంధ్రజ్యోతి) మండల కేంద్రంలోని ఆంజనేయ స్వామి దేవాలయంలో శనివారం గురుస్వామి పిల్లి మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో 20 మందికి ఆంజనేయస్వామి మాలధారణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో గురుస్వాములు రవినాయా, రమేష్, కాటమయ్య గౌడ్, ఆంజనేయులు, పాల్గొన్నారు.

● మన్ననూర్, (ఆంధ్రజ్యోతి) : అమ్రాబాద్ మండలం మన్న నూరు గ్రామంలో హనుమాన్ మాలధారణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. కార్యక్రమంలో హనుమాన్ స్వాములు నిరం జన్, శ్రీను, వెంకటేష్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



నాగుల విగ్రహాల వద్ద వెలుగుతున్న దీపాలు

శివస్వాములకు అన్నప్రసాదం

కల్వకుర్తి, (ఆంధ్రజ్యోతి) : శివమాలలు ధరించిన స్వాములకు భక్తిశ్రద్ధలతో శివునికి పూజలు చేశారు. కల్వకుర్తి పట్టణంలోని వేంకటేశ్వర స్వామి దేవాలయంలో గురుస్వామి కార్వంగ ఆనంద్‌గౌడ్ ఆధ్వర్యంలో శివమాలలు ధరించిన శివ స్వాములకు మండల దీక్షకాలం నిత్య అన్నదానం కార్యక్రమంలో భాగంగా శనివారం మాజీ మునిసిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం అన్నప్రసాద కార్యక్రమం నిర్వహించారు. మునిసిపల్ వైస్ చైర్మన్ షాహెద్, గురుస్వాములు ఆంజనే యులు, వెంకటయ్య, రాజు, బాలరాజు, జంగయ్య, శివ స్వాములు, హనుమాన్ స్వాములు పాల్గొన్నారు.

వంతెన నిర్మాణంలో జాప్యం తగదు

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు వేముల నరేందర్

వంగూరు/ ఉప్పునుంతల, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): వంగూరు, ఉప్పునుంతల మండలాల సరిహద్దులోని ఉల్పర వద్ద దుందుభీ వాగులో హైలెవల్ వంతెన నిర్మాణ పనుల్లో కాలయాపన తగదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వేముల నరేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మండలంలో వర్షాలకు దెబ్బతిన్న ఉల్పర కాజ్‌వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నరేందర్ మాట్లాడుతూ హైలెవల్ వంతెన నిర్మాణానికి నిధులు మంజూరైనప్పటికీ ప్రభుత్వం టెండర్ నిర్వహించకపోవటంతో పనులు జరగటం లేదని పేర్కొన్నారు. ప్రస్తుతం దుందుభీ వాగు ప్రవహిస్తుండటంతో ఈ రహదారిపై రాకపోకలు నిలిచిపోయి ప్రజలు ఎంతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే అధికారులు టెండర్ ప్రక్రియను పూర్తి చేసి పనులు ప్రారంభించాలని, కల్వకుర్తి నుంచి మొల్గర వరకు డబుల్ రోడ్డును మంజూరు చేయాలని ప్రభు త్వాన్ని కోరారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు ఆనందురెడ్డి, కొండల్‌రెడ్డి పాల్గొన్నారు.



ఉల్పర వద్ద దెబ్బతిన్న రోడ్డును పరిశీలిస్తున్న నరేందర్

ప్రజల్ని మోసగిస్తున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ : బీజేపీ

కొల్లాపూర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : హా మీల పేరుతో రాష్ట్ర ప్రజలను మోసగించడంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు దొందూదొందేనని బీజేపీ జిల్లా నాయకుడు తమటం సాయికృష్ణ గౌడ్ అన్నారు. శనివారం కొల్లాపూర్ పట్టణంలో బీజేపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమా వేశంలో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ పార్టీ అవినీతి ని ఆ పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ కూతురు కవిత బయట పెడితే, కాంగ్రెస్ పార్టీలో అవినీతిని మం త్రులు బయటపెడుతున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణలో సబ్బండ వర్గాలను అతలాకుతలం చేసిన బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు ప్రజలు స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటు ద్వారా తగిన బుద్ధి చెప్తారన్నారని ఆయన పేర్కొన్నారు.

పెండింగ్ స్కాలర్‌షిప్‌లు వెంటనే చెల్లించాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎండీ సయ్యద్

అచ్చంపేటటౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు గడుస్తున్నా విద్యార్థులకు చెల్లించాల్సిన స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంటు చెల్లించకుండా కాలయాపన చేస్తూ వారి జీవితాలతో ఆడుకుంటోందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎండీ సయ్యద్ అన్నారు. శనివారం పట్టణంలోని కళాశాలలో ఎస్ఎఫ్ఐ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు రాష్ట్ర బడ్జెట్‌లో 15శాతం నిధులు విద్యారంగానికి కేటాయిస్తామని హామీఇచ్చి, అధికారంలోకి వచ్చాక అందులో సగమైన కేటాయించడం లేదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పదించి విద్యార్థులకు కేటాయించాల్సిన స్కాలర్‌షిప్‌లు, ఫీజురీయింబర్స్‌మెంట్ ఫీజులు వెంటనే చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ సభ్యులు ప్రవీణ్, శివ, తరుణ్, విజయ్ పాల్గొన్నారు.

చెంచు కుటుంబానికి నిత్యావసర సరుకుల పంపిణీ

మన్ననూర్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : నల్లమల అటవీ ప్రాంతంలోని ఈర్లపెంటలో వెంకటయ్య అనే చెంచుకుటుంబానికి నిత్యావసర సరుకులను మహబూబ్‌నగర్‌కు చెందిన న్యాయవాది తగిలి కృష్ణ శనివారం పంపిణీ చేశారు. గత నెల 18న ఈర్లపెంటకు చెందిన భౌరమ్మ అనే చెంచు మహిళ మహబూబ్‌నగర్ జిల్లా ఆసుపత్రిలో అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందింది. మిగతా కుటుంబ సభ్యులు జీవనం సాగించేందుకు తీవ్రంగా ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న న్యాయవాది, అటవీ అధికారుల అనుమతితో బాధిత కుటుంబ సభ్యులకు సరుకులను అందజేసినట్లు తెలిపారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

కందనూలు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను తక్షణమే ప్రారంభించి, రైతులను ఆదుకోవాలని భారత కిసాన్ సంఘ్ నాయకులు కోరారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల ద్వారా నేరుగా మొక్కజొన్న కొనుగోలు చేయాలని కోరారు. ప్రభుత్వం కొనుగోలు చేయకుంటే దళారుల పాలిట రైతులు తీవ్ర నష్టపోతారని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో భారత కిసాన్ నాయకులు గుండ్ల చంద్రయ్య, ఆంజనేయులు, అశోక్‌రెడ్డి, పోలీస్ చంద్రయ్య, దాసరి బాలస్వామి, మలిశెట్టి శర్వాందా, ఎద్దుల విష్ణువర్ధన్‌రెడ్డి, గాండ్ల చిన్నయ్య, లక్ష్మణ్ గౌడ్, గిరిబాబు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో విస్తారంగా కురిసిన వర్షం

నాగర్‌కర్నూల్ టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా శనివారం విస్తారంగా వర్షం కురి సింది. జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షం కురవగా మరికొన్ని ప్రాంతాల్లో తేలికపాటి వర్షం కురిసింది. లింగాల మండలంలో అత్య ధికంగా 32.8 మిల్లీమీటర్లు, ఉప్పునుంతల మండలంలో అత్యల్పంగా 0.5 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. జిల్లా కేంద్రంలో శని వారం సాయంత్రం భారీ వర్షానికి రోడ్లన్నీ జల యమయ్యాయి. పలు వీధుల్లో డ్రైనేజీలు పొంగి పొర్లడంతో ఎగువన ఉన్న వర్షపు నీరు ప్రధాన రహదారిపైకి చేరుకోవడంతో టెలిఫోన్ ఎక్స్ఛేం జ్, బస్టాండు కూడలి, రాంనగర్‌కాలనీ, నల్లవెల్లి రోడ్డు శిశు మందిర్ స్కూల్ ప్రాంతంలో తదితర ప్రాంతంలో రోడ్లపై నిలిచిన వర్షపు నీటితో వాహనదారులు తీవ్ర ఇబ్బందిపడ్డారు. స్కూల్స్, కళాశాలలు వదిలే సమయంలో కావడంతో వర్షానికి చిత్తడిగా మారిన రోడ్లపై వెళ్లేందుకు విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు.



నాగర్‌కర్నూల్ బస్టాండు సమీపంలో చిత్తడిగా మారిన దారి

ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

వంగూరు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంత నిరుద్యోగులు ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో బ్రహ్మచారి అన్నారు. శనివారం మండలంలోని కొండారెడ్డిపల్లి ఫాక్స్‌కాన్ కంపెనీ వారు సెలక్ట్ చేసుకున్న 34 మంది నిరుద్యోగులకు ఉద్యోగం, విధుల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన ఈ అవకాశాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో శ్రీకాంత్, సౌందర్య, రమేష్, లక్ష్మి, నజీర్ పాల్గొన్నారు.

'మద్యం షాపులు మార్చాలి'

పెంట్లవెల్లి అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : పెంట్లవెల్లి కొత్త బస్టాండ్ సమీపంలో ఉన్న మద్యం దుకాణాన్ని వేరే ప్రాంతానికి మార్చాలని పెంట్లవెల్లి సామాజిక నాయకులు మూలే మేఘరాజు అన్నారు. శనివారం కొత్త బస్టాండ్ ఎదురుగా ఉన్న మద్యం దుకాణం వల్ల వాహనాలు రాకపోకలు ఇబ్బందిగా ఉందన్నారు. ఊరి బయట ఉండేలా చూడాలన్నారు. ప్రజలతోసంతకాలు సేకరించి కలెక్టర్‌కు అందజేస్తామని అన్నారు.

వచ్చే నెల 6న వైద్య శిబిరం

- ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ



రాజీవ్,ఎన్టీఆర్ స్టేడియం పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

అచ్చంపేట, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : అచ్చంపేట ఏరియా ఆసుపత్రిలో నవంబరు 6న ఉచిత మెగా మల్టీ స్పెషాలిటీ మెడికల్ క్యాంపును నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ అన్నారు. శనివారం పట్టణంలోని ఏరియా ఆసుపత్రిని పరిశీలించారు. అక్కడ రోగులకు అందుతున్న వైద్య సేవలగురించి అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ మహబూబ్‌నగర్ ఎస్‌వీఎస్ ఆసుపత్రి వారి సౌజన్యంతో సీబీఎం ట్రస్ట్ సహకారంతో మల్టీ స్పెషాలిటీ మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. దాదాపు 40 మంది వైద్యులు ఈ శిబిరంలో పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని అచ్చంపేట నియోజకవర్గం కాకుండా జిల్లాలోని నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, నియోజకవర్గాలతో పాటు పక్కనున్న దేవరకొండ నియోజకవర్గ ప్రజలు కూడా ఉపయోగించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో డాక్టర్లు ప్రదీప్, బిక్కునాయక్, వైద్య సిబ్బంది ఉన్నారు.

స్టేడియం విస్తరణ పనుల పరిశీలన

పట్టణంలోని రాజీవ్, ఎన్టీఆర్ స్టేడియం విస్తరణ పనులను శనివారం ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ మునిసిపల్ కమిషనర్, సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. సీతారాల గుంట, హౌసింగ్ కార్యాలయం వైపు స్టేడియం విస్తరణ పనులు చేపడుతున్నారు. తర్వలో పనులు పూర్తిఅయ్యేలా చర్యలు చేపట్టాలని ఆయన అధికారులకు, కాంట్రాక్టర్‌కు సూచించారు. ఆయన వెంట కౌన్సిలర్ నిర్మలాబాలరాజు, ఆకుల వెంకటేష్ ఉన్నారు.

ప్రతీ పశువుకు టీకాలు వేయించాలి

- పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి జ్ఞాన శేఖర్

ఊర్కొండ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : గాలికుంటు వ్యాధి సోకితే పాడి పశువుల్లో పాల దిగుబడి తగ్గుతుందని, ప్రతీ పాడి పశువుకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి డాక్టర్ జ్ఞానశేఖర్ అన్నారు. శనివారం మండల కేంద్రంతో పాటు ముచ్చర్లపల్లిలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఈ నెల 15నుంచి నవంబరు 14 వరకు గాలికుంటు నివారణ టీకాల కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఊర్కొండ మండలంలో 218 పాడి ఆవులు, 92 గేదెలకు ఈ టీకాలు వేశామని తెలిపారు. మండల పశువైద్యాధికారి డాక్టర్ రాజేష్‌కుమార్ రైతులు ఉన్నారు.



ఊర్కొండలో టీకా కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి డాక్టర్ జ్ఞాన శేఖర్

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- కల్వకుర్తి సీఐ బి.నాగార్జున

కల్వకుర్తి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి, అప్రమత్తంగా ఉండాలని కల్వకుర్తి సీఐ బి.నాగార్జున, ఎస్ఐ జి.మాధవరెడ్డి అన్నారు. కల్వకుర్తి పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసు అమరుల దినోత్సవంలో భాగంగా ఓపెన్‌హౌస్ కార్యక్రమం శనివారం నిర్వహిం చారు. పోలీస్ స్టేషన్‌లో ప్రతీ రోజు జరిగే సేవలు, పోలీసుల విధులు, సీసీటీవీ, 100డయల్, ఉమెన్ సేఫ్టీ, చట్టాలపై ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. పోలీస్ వైర్‌లెస్ కమ్యూనికేషన్, షీటీమ్స్ గురించి అవగాహన కల్పించారు. శాంతిభద్రతలు పరిరక్షణలో పోలీసులకు ప్రజలు సహకరించాలని కోరారు. కల్వకుర్తి 2వ ఎస్ఐ రాజశేఖర్, ఏఎస్ఐ శ్రీనివాసులు, హెడ్‌కానిస్టేబుల్ వెంకటయ్య, సిబ్బంది, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

దళితుల ఆత్మగౌరవ ర్యాలీని విజయవంతం చేయాలి

- ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రాజు

వెల్దండ, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నవంబరు 1న హైదరాబాద్‌లో నిర్వహించే దళితుల ఆత్మగౌరవ మహార్యాలీని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు గుడిగానిపల్లి రాజు కోరారు. శనివారం మండల కేంద్రంలో నిర్వహించిన ఎమ్మార్పీఎస్ సమావేశంలో రాజు మాట్లాడుతూ మహా ర్యాలీలో వివిధ సంఘాలు, రాజకీయ, ప్రజాసంఘాల నాయకులు పెద్దఎత్తున పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు శ్రీను, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి కానుగుల జంగయ్య, నాయకులు జంగిలి నిరంజన్ ఉన్నారు.

మెడికల్ కళాశాల భూ నిర్వాసితులకు పరిహారం ఇవ్వాలి

- బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బోనాసి రాంచందర్

నాగర్‌కర్నూల్ టౌన్, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ఉయ్యాలవాడ ప్రభుత్వ మెడికల్ కళాశాల భూ నిర్వాసితులకు హైకోర్టు ఉత్తర్వుల ప్రకారం పరిహారం చెల్లించాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు బోనాసి రాం చందర్ డిమాండ్ చేశారు. శనివారం బీఎస్పీ ఆధ్వర్యంలో బాధిత రైతులు నాగర్‌కర్నూల్ ఆర్డీవో సురేష్‌కు వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఉయ్యాలవాడ మెడికల్ కళాశాలకు భూములు ఇచ్చిన రైతులు తప్పెట రాములు, మిద్దె అలివేల పరిహారం చెల్లింపులో ఆనాటి ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యహించిందని రాష్ట్ర హైకోర్టు తప్పుబట్టిందని గుర్తు చేశారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి మెడికల్ కళాశాల భూ నిర్వాసిత రైతులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా నాయకులు పృథ్వీరాజ్, సాయిబాబా, బాధిత రైతులు కాకునూరి మధు, తప్పెట రాములు తదితరులు పాల్గొన్నారు.



బాధిత రైతులతో కలిసి ఆర్డీవో సురేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఎస్పీ నాయకులు

విత్తనాల పంపిణీలో అక్రమ వసూళ్లు సహించం

- మార్కెట్ చైర్మన్ దండు నరసింహ

పెద్దకొత్తపల్లి, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : వేరుశనగ విత్తనాల కోసం వచ్చిన రైతుల నుంచి ఒక్కొక్కరి నుంచి అక్రమంగా రూ.2100 చొప్పున అక్రమ వసూళ్లకు పాల్పడగా, అడ్డుకట్ట వేసినట్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దండు నర్సింహ అన్నారు. సుమారు రూ.27 లక్షలు వసూలు చేస్తే ఈ విషయాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లి తాము అడ్డుకున్నామని ఆయన వెల్లడించారు. ఉచితంగా రైతులకు పంపిణీ చేయాల్సి ఉండగా కొందరు బీజేపీ నాయకులు, అడవి తల్లి సొసైటీ ప్రతినిధులు కుమ్మక్కై రైతుల నుంచి డబ్బు వసూళ్లకు పాల్పడడంపై ఏఎంసీ చైర్మన్‌తోపాటు మండల కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. శనివారం మండల కేంద్రంలోని మార్కెట్ కమిటీ నూతన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సమావేశంలో మాజీ సర్పంచ్‌లు ఆదెర్ల వెంకటేశ్వర్‌రెడ్డి, వి.సత్యం, మాజీ ఎంపీటీసీ సభ్యులు రవికుమార్, నాయకులు బాలునాయక్, శ్రీనివాస్‌యాదవ్, వెంకటస్వామిగౌడ్, మల్లయ్య పాల్గొన్నారు.

ప్రజలకు నాణ్యమైన కరెంటు ఇవ్వడమే లక్ష్యం

- విద్యుత్ డీఈ శ్రీధర్

కందనూలు, అక్టోబరు 25 (ఆంధ్రజ్యోతి) : ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యంగా పని చేస్తున్నట్లు విద్యుత్ శాఖ డీఈ శ్రీధర్‌శెట్టి అన్నారు. నాగర్‌కర్నూల్ మునిసిపాలిటీ పరిధిలో హౌసింగ్‌బోర్డులోని 22వ వార్డులో కరెంటు సమస్యలు, ట్రాన్స్‌ఫార్మర్ల మార్పిడి స్తంభాల మార్పుట పరిశీలించి తక్షణమే మరమ్మతులను చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఆదేశానుసారం విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్‌నందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లతోపాటు విద్యుత్ లైన్లు స్తంభాలు, వైర్లు సమస్యలు ఎక్కడున్నా తక్షణమే గుర్తించి మరమ్మతులు చేపట్టేందుకు బస్తీబాట చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 22వ మాజీ కౌన్సిలర్ తీగల సునేంద్రకుమార్, కాలనీవాసులు అమీర్ అహ్మద్, కృష్ణమాచారి, అబ్దుల్ సమద్, మహమ్మద్ ఖాజామియా, శంకరయ్య, కాలనీవాసులు విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.



నాగర్‌కర్నూల్ హౌసింగ్‌బోర్డు కాలనీలో కరెంటు సరఫరాను తెలుసుకుంటున్న విద్యుత్ శాఖ డీఈ శ్రీధర్‌శెట్టి

విద్యుత్ సమస్యలు లేకుండా చూస్తాం

అచ్చంపేటటౌన్ (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో విద్యుత్ అంతరాయం లేకుండా చూస్తామని విద్యుత్ ఏఈ ఆంజనేయులు అన్నారు. ప్రజాబాట కార్యక్రమంలో విద్యుత్ ఏఈ, సిబ్బందితో కలిసి లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్ స్టేషన్లుకింద ఉన్న చెట్ల కొమ్మలను శనివారం కత్తిరించారు. కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.



అచ్చంపేటలోని మొక్కలను తొలగించిన విద్యుత్ సిబ్బంది

విద్యుత్ అధికారుల ప్రజాబాట

కల్వకుర్తి (ఆంధ్రజ్యోతి) : విద్యుత్‌సమస్యల పరిష్కారం కోసం కల్వకుర్తి పట్టణంలో శనివారం ఉదయం విద్యుత్ అధికారులు ప్రజాబాట కార్యక్రమం నిర్వహించారు. బస్సు డిపో తదితర కాలనీల్లో ఏడీఈ శంకరయ్య, ఏఈ శ్రీనివాస్, లైన్‌మెన్లు శ్రీధర్‌చారి, నర్సిరెడ్డిలు పర్యటించి ప్రజలతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో ప్రజాబాట

వెల్దండ, (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో ప్రజాబాట కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని 11 కేవీ విద్యుత్ లైన్లకు అంతరాయం కలిగిస్తున్న చెట్ల కొమ్మలను తొలగించారు. అదేవిధంగా ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ ఉన్న కంపచెట్లను తొలగించి, వేలాడుతున్న వైర్లను సరిచేశారు. కార్యక్రమంలో ఏఈ వెంకటేష్, లైన్‌మెన్ లక్ష్మణ్‌నాయక్, యాదయ్య, యాదగిరి, సిబ్బంది సికిందర్, రాజు తదితరులు ఉన్నారు.